భక్తిశ్రద్ధలతో సత్యసాయి అష్టోత్తర నామం


ప్రశాంతి నిలయంలో వ్రత పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పుట్టపర్తి, న్యూస్‌టుడే : విశ్వశాంతిని కాంక్షిస్తూ భక్తిశ్రద్ధలతో భక్తులు అష్టోత్తర నామం పఠించారు. సత్యసాయి మహా సమాధి దర్శనార్థం ఉత్తర కర్ణాటకకు చెందిన వేలాది మంది భక్తులు పర్తియాత్రతో పుట్టపర్తికి వచ్చారు. ప్రపంచ మానవాళి సుఖసంతోషాలతో ఉండాలని కాంక్షిస్తూ భక్తులు సత్యసాయి సచ్చరిత్ర పారాయణం పఠిస్తూ బాబా చిత్రపటానికి పూజలు చేశారు. సాయి నామస్మరణతో ప్రశాంతి నిలయం పులకించిపోయింది. సాయంత్రం భక్తులు అద్భుతంగా సంగీత కచేరీ నిర్వహించారు. వేలాది మంది భక్తులు బారులు తీరి మహా సమాధిని దర్శించుకున్నారు.

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: జిల్లా ప్రజాపరిషత్తు సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత రెండో సమావేశం నిర్వహిస్తున్నారు. ఉదయం 10.30 గంటలకు జడ్పీ హాలులో నిర్వహించనున్న ఈ సమావేశానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు. అన్ని శాఖల అధికారులకు బదిలీలు జరిగాయి. రెండు జిల్లాల్లో మొత్తం 90 శాతం మంది అధికారులకు బదిలీలు జరిగాయి. ఈ సమావేశంలో పరిచయ కార్యక్రమాలు, వ్యవసాయం, రహదారులపై ప్రధాన చర్చ జరిగే అవకాశముంది. గతంలో చేసిన ప్రతిపాదనల అమలు తీరును కూడా సమీక్షించే అవకాశం ఉంది. జడ్పీ సర్వసభ్య సమావేశానికి అన్ని ఏర్పాట్లు చేశామని ఇన్‌ఛార్జి సీఈఓ వెంకటసుబ్బయ్య తెలిపారు.

ఖాద్రీశా..
- కాలువల నిర్వహణలో నిర్లక్ష్యం
- ఆలయ పరిసరాల్లో ఆక్రమణలు

వరద ముప్పు తప్పేనా?


ఆలయ ముందు భాగంలో ఉత్తరం వైపు ఆక్రమణకు గురైన కాలువ


ఖాద్రీశుని ఆలయం

ఏటా ఆదాయం: సుమారు రూ.13 కోట్లు
నిత్యం సందర్శించే భక్తులు: దాదాపు 6 వేలు
ప్రత్యేక రోజుల్లో..: 15 వేల నుంచి 20 వేల మంది వరకు

కదిరి, న్యూస్‌టుడే: కదిరిలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి దక్షిణ భారతావనిలో ఎంతో ప్రాశస్త్యం ఉంది. వివిధ ప్రాంతాల నుంచి నిత్యం వేలాదిగా భక్తజనం వచ్చి స్వామిని దర్శించుకుంటూ ఉంటారు. భక్తుల కొంగు బంగారమైన స్వామి.. ఏటా కోట్లాది రూపాయలు ఆదాయం సమకూరే క్షేత్రానికి వరద ముప్పు పొంచి ఉంది. దీనికి కారణం అధికార యంత్రాంగం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరే. భారీ వర్షాలు వచ్చినప్పుడల్లా ఆలయంలోకి వరద నీరు ప్రవేశిస్తున్నా.. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చూపలేకపోతున్నారు. గురువారం రాత్రి ఆలయంలోకి వరద రావడంతో భక్తులు పడరాని పాట్లు పడ్డారు. మోస్తరు నుంచి భారీ వాన వస్తే చాలు ఇదే పరిస్థితి తలెత్తుతున్నా పాలకవర్గం, అధికారులు తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారు. ఆలయ పరిసరాల్లోని కాలువలు పూడిక పేరుకుపోయి తరచూ స్తంభించిపోతున్నా వాటి నిర్వహణ కరవైంది. మరోవైపు ఆక్రమణలకు గురికావడంతో పరిస్థితి మరింత జఠిలంగా మారుతోంది. ఇదిలా ఉండగా సీసీ రోడ్డు నిర్మాణం ఆలయం వైపు వాలుగా ఉండటంతో వరద లోనికి వెళుతోంది.

తూర్పు గోపురం నుంచి..


తూర్పు గోపురం ముందు వరద నీరు వెళ్లాల్సిన కాలువ తీరు ఇలా..

తూర్పు గోపురం ముందున్న ధ్వజస్తంభానికి సమీపాన కాలువ రూపు కోల్పోయింది. గోపురం ముందు ఉత్తరం వైపు నుంచి మురుగు, వర్షపునీరు వెళ్లేందుకు నిర్మించినా ఆక్రమణలకు గురైంది. మోస్తరు నుంచి భారీ వర్షం వస్తే తూర్పు గోపురం గుండా వరద నీరు ఆలయంలోకి వెళ్తోంది. ఆవరణ నుంచి పడమర గోపురం దిశగా వరద బయటికి వస్తుంది. ఆక్రమణలు తొలగించడం, కాలువను విస్తరించడం.. వారానికి ఒకటి, రెండు సార్లైనా పూడిక మట్టి తొలగించి.. పకడ్బందీగా నిర్వహణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని భక్తులు పేర్కొంటున్నారు.

శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

మున్సిపల్ అధికారుల సమన్వయంతో వరద నీరు ఆలయంలోకి రాకుండా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఇంజినీర్లతో చర్చించాం. ఆక్రమణలు తొలగించి వరద సమస్య లేకుండా శాశ్వత పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. - **శ్రీనివాసరెడ్డి, ఆలయ ఈవో**

మాటలతో బురిడీ..

గుట్టులాగి దోపిడీ

- వ్యూహాలు మారుస్తున్న సైబర్ నేరగాళ్లు
- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న బాధితులు

ఈనాడు, అనంతపురం, న్యూస్‌టుడే, అనంత నేరవార్తలు

ఆత్యాశ, బలహీనతలను ఆసరాగా తీసుకుని సైబర్ నేరస్తులు రెచ్చిపోతున్నారు. స్టాక్ మార్కెట్, డిజిటల్ అరెస్టు, పార్సిల్ కొరియర్ వంటి పేర్లతో పలువురిని మోసగించి రూ.లక్షలు కాజేస్తున్నారు. ధర్మవరం పట్టణానికి చెందిన వైద్యుడి నుంచి డిజిటల్ అరెస్టు పేరుతో రూ.30 లక్షలు నొక్కేయడం కలకలం రేపింది. అవగాహన ఉన్న వైద్యుడినే బురిడీ కొట్టించారంటే ఇక అమాయకుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. సైబర్ నేరస్తుల బాధితుల్లో కొందరే పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. ముఖ్యంగా మధ్యతరగతికి చెందిన చాలామంది పరువు పోతుందోనని బయటకు చెప్పుకోలేకపోతున్నారు. ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదు.

హాస్టల్ విద్యార్థుల తల్లిదండ్రులే లక్ష్యం

చాలామంది తల్లిదండ్రులు పిల్లలను హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ ప్రాంతాల్లో చదివిస్తున్నారు. తాము ఫలానా పోలీస్‌స్టేషన్ నుంచి మాట్లాడుతున్నామని.. మీ అబ్బాయి కొంతమందితో కలిసి గంజాయితో దొరికిపోయాడని తల్లిదండ్రులకు ఫోన్ చేస్తారు. కేసు నుంచి తప్పించాలంటే తమకు డబ్బులు పంపించాలని డిమాండ్ చేస్తారు.

వర్చువల్ ఫోన్ నంబర్లతో..

బెదిరింపులకు పాల్పడే నేరస్తులు వర్చువల్ నంబర్లను వినియోగిస్తున్నారు. ప్రత్యేక యాప్‌ల ద్వారా సంబంధం లేని ఫోన్ నంబరు సంపాదించి, ఆ నంబను నుంచి వాట్సప్ కాల్స్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారు. వర్చువల్ నంబర్ల ద్వారా ఫోన్ చేసిన వారిని పట్టుకోవడం కష్టమవుతోందని సైబర్ పోలీసులు చెబుతున్నారు.


స్టాక్ మార్కెట్ పేరుతో..

ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, వివిధ వృత్తుల్లో ఉన్నవారితోపాటు వ్యాపారాలు చేసేవారు సైతం స్టాక్‌మార్కెట్‌లో ఆన్‌లైన్‌లో ట్రేడింగ్ చేస్తున్నారు. దీన్ని ఆసరాగా తీసుకుంటున్న సైబర్ దొంగలు మోసాలకు తెరతీస్తున్నారు. రోజుకో యాప్ తీసుకొచ్చి ట్రేడింగ్ పేరుతో ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. బోనస్ ఇస్తామని, కొంత మొత్తంలో లాభాలు ఇచ్చి ఆశ పెంచుతున్నారు. పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టే సరికి మొత్తం లాగేసుకొని పత్తాలేకుండా పోతున్నారు. ఇలా కదిరికి చెందిన ఓ వ్యక్తి ఒకేరోజు రూ.18 లక్షలు పోగొట్టుకున్నాడు.

ఉమ్మడి అనంత జిల్లాలో సైబర్ నేరాలు..



సంవత్సరాల వారీగా కేసుల తీరు..



అప్రమత్తతే శ్రీరామరక్ష

- జగదీశ్, ఎస్పీ, అనంతపురం

అపరిచిత వ్యక్తుల నంబర్ల నుంచి వచ్చే కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దు. టెలిగ్రామ్, వాట్సప్‌లో వచ్చే తెలియని లింకులపై క్లిక్ చేస్తే సైబర్ దొంగల వలలో చిక్కుకునే ప్రమాదం ఉంది. ఇటీవల డిజిటల్ అరెస్టు పేరుతో డబ్బులు లాగేస్తున్నారు. ఒకవేళ ఇలా ఎవరైనా ఫోన్ చేస్తే సైబర్ విభాగ పోలీసులకు ఫిర్యాదు చేయండి.

- అనంతపురానికి చెందిన దంపతుల కుమారుడు అమెరికాలో ఎంఎస్ చదువుతున్నాడు. వారం కిందట ఓ వ్యక్తి అమెరికా సీరీస్ ఫోన్ నంబరుతో తండ్రికి వాట్సాప్ కాల్ చేశాడు. మీ కుమారుడు ఇక్కడ రోడ్డు ప్రమాదానికి కారణమయ్యాడు. అతన్ని అరెస్టు చేశాం. 50 వేల డాలర్లు పంపితే విడుదల చేస్తామన్నారు. తండ్రి కుమారుడి ఫోన్ చేయడానికి ప్రయత్నించగా స్విచ్ఛాఫ్ వచ్చింది. కంగారుపడిన కుటుంబసభ్యులు 50 వేలడాలర్లు (రూ.40 లక్షలు) ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఎందుకైనా మంచిదని తండ్రి సైబర్ క్రైబ్ పోలీసులను ఆశ్రయించారు. సైబర్ నేరగాళ్ల పని అని తేలింది.

- అనంతపురంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే ఓ వ్యక్తి స్టాక్ మార్కెట్‌లో అడపాదడపా పెట్టుబడి పెట్టేవాడు. రెండు రోజుల కిందట ఓ యాప్‌లో ఎక్కువ డబ్బులు వస్తాయని తెలిసి అందులో పెట్టుబడి పెట్టాడు. మొదట రూ.50 వేలు లాభం వచ్చింది. 3 గంటల వ్యవధిలోనే రూ.1.50 లక్షల వరకు లాభం వచ్చింది. ఆశపడి ఒకేసారి రూ.12 లక్షలు పెట్టేశారు. మొత్తం నష్టపోయినట్లు సందేశం వచ్చింది.

- హిందూపురానికి చెందిన సాఫ్ట్‌వేర్ యువతికి అపరిచిత నంబరు నుంచి ఫోన్ వచ్చింది. "మేం ముంబయి సీటీ పోలీసులం. మీ ఆధార్ నంబరుతో లింకైన కొన్ని ఫోన్ నంబర్లను వివిధ నేరాల్లో వినియోగించారు. డ్రగ్స్, హవాలా వంటి నేరాలకు సంబంధించి మీ ఆధార్ నంబరు చూపిస్తోంది. మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తున్నాం. విచారణకు సహకరించండి. లేదంటే మా పోలీసులు మీ ఇంటి బయటే ఉన్నారు. వెంటనే అరెస్టు చేస్తారు" అని బెదిరించారు. యువతి గంటకుపైగా వారితో వీడియో కాల్ మాట్లాడింది. మీ బ్యాంక్ ఖాతా ట్రాక్ చేయడం కోసం రూ.3 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయాలన్నారు. డబ్బుల కోసం తండ్రికి ఫోన్ చేసి విషయం చెప్పింది. అతను పోలీసులను ఆశ్రయించగా.. సైబర్ నేరగాళ్ల పనేనని తేలింది.

184 హెక్టార్లలో పంట నష్టం


దెబ్బతిన వరి పంట

పుట్టపర్తి, న్యూస్‌టుడే : అల్పపీడన ప్రభావంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలు వ్యవసాయ, ఉద్యాన పంటలపై తీవ్ర ప్రభావం చూపాయి. వ్యవసాయ పంటలు 184, ఉద్యాన పంటలు 2.4 హెక్టార్లలో నష్టం జరిగినట్లు ఆయా శాఖాధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. ఇంకా పంట నష్టం లెక్కింపు ప్రక్రియ జరుగుతోంది. కోత దశలో ఉన్న మొక్కజొన్న, వరి పంటలు బాగా దెబ్బతిన్నాయి. వరి 33 హెక్టార్లు, పత్తి 10, మొక్కజొన్న 1, వేరుసెనగ 116, కంది 14, జొన్న 1, కొర్ర 6, సజ్జ 2 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. ఉద్యాన పంటలు అరటి, వంకాయ, టమాటా 2.4 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

కదిరిలో 60 మి.మీ.ల వర్షం

శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా 25 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా కదిరి 60, అత్యల్పంగా అమరాపురం 1.6 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. ముదిగుబ్బ 50.8, గాండ్లపెంట 37.8, బత్తలపల్లి 34.6, ఓడీసీ 28.2, రామగిరి 28.0, నల్లమాడ 26.0, ఎన్‌పీకుంట 25.0, పెనుకొండ 18.4, నల్లచెరువు 18.2, తనకల్లు 15.6, అమడగూరు 13.4, కొత్తచెరువు 12.8, బుక్కపట్నం 12.4, రొద్దం 12.0, తాడిమర్రి 10.2, పుట్టపర్తి 8.6, తలుపుల 7.4, కనగానపల్లి 6.2, సీకేపల్లి 6.0, మడకశిర 4.0, సోమందేపల్లి 4.0, ధర్మవరం 3.8, హిందూపురంలో 2.6 మి.మీ.ల వర్షపాతం నమోదైనట్లు జిల్లా ప్రణాళికాధికారి విజయ్‌కుమార్ తెలిపారు.




వామ్మో జ్వరాలు!

వాతావరణ మార్పులతో విజృంభణ


అనంతపురం సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్న పిల్లలు

ఉమ్మడి అనంత జిల్లాలో ఇలా..

ఇంటింటా సర్వే: ఈనెల1 నుంచి 16వతేదీ వరకు
జ్వర బాధితుల సంఖ్య : 18,713
సామాజిక, ప్రాంతీయ ఆసుపత్రులు, పీహెచ్‌సీల్లో చికిత్స పొందిన వారు: 1,684
అత్యధికంగా జ్వరం కేసులు నమోదైన ప్రాంతాలు:
అనంతపురం జిల్లా: అనంతపురంలో 379, యాడికి 174, బ్రహ్మసముద్రం 169, బొమ్మనహాళ్ 166, తాడిపత్రిలో 164 మంది జ్వరబాధితులను గుర్తించారు.
శ్రీసత్యసాయి జిల్లా: ధర్మవరంలో 694, హిందూపురం 676, మడకశిర 396, కదిరి 286, రొద్దం 274, ముదిగుబ్బలో 272 మందిని గుర్తించారు.



అనంతపురం (వైద్యం), పుట్టపర్తి, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా జ్వరబాధితులు పెరుగుతున్నారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు.. వాతావరణంలో మార్పులు ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. మరోవైపు మురుగుపారుదల వ్యవస్థ అస్తవ్యస్తం, తాగునీరు కలుషితం, పారిశుద్ధ్య లోపంతో దోమల వ్యాప్తి అధికంగా ఉంది. ఉమ్మడి జిల్లాలో ఎక్కువగా జ్వరంతోపాటు దగ్గు, జలుబు, ఆయాసం, ఊపిరితిత్తుల్లో నెమ్ము చేరిక... తదితర లక్షణాలతో చాలా మంది చికిత్స పొందుతున్నారు. వారంలో ప్రతి శుక్రవారం వైద్యఆరోగ్య శాఖ, పురపాలక, పంచాయతీరాజ్ శాఖ అధికారులు సమన్వయంతో డ్రైడే నిర్వహించాలి. ఈ కార్యక్రమాన్ని కేవలం ఫొటోలు దిగి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయటంతోనే సరిపెడుతున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో పరిస్థితి అధ్వానంగా తయారైంది. అనంతపురంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల పీడియాట్రిక్, జనరల్ మెడిసిన్ విభాగాలలో 40 మంది జ్వరపీడితులు చికిత్స పొందుతున్నారు.

లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి

చలి, ఉన్నట్టుండి జ్వరం, తలనొప్పి వచ్చి.. కొన్ని గంటల తరువాత ఆగి.. మళ్లీ వస్తే మలేరియాగా నిర్ధారించవచ్చు. జ్వరంతోపాటు నడుము, తీవ్రమైన కండరాల నొప్పి, ఆకలి మందగించడం, నోరు రుచిలేకపోవటం, ఆయాసం, కడుపునొప్పి, బీపీ తగ్గడం తదితర లక్షణాలుంటే డెంగీగా పేర్కొనవచ్చు. కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, కళ్లు మబ్బులు కమ్మటం, చర్మం పొడిబారడం.. తదితర లక్షణాలు అతిసారాన్ని సూచిస్తాయి. జ్వరం లక్షణాలు ఉండి తగ్గకపోతే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలి.

- భీమాసేనాచారి, హెచ్‌వోడీ, జనరల్‌మెడిసిన్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల

ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాలు

జ్వర బాధితులు ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి వ్యయప్రయాలసకు గురికావాల్సిన అవసరం లేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక, ప్రాంతీయ ఆసుపత్రులతో పాటు సర్వజన వైద్యశాలలో అన్ని సేవలు అందించేందుకు తగిన సౌకర్యాలు ఉన్నాయి. పీహెచ్‌సీ, సామాజిక ఆసుపత్రుల్లో రక్తపరీక్షలు సైతం చేస్తారు. జ్వరాలకు సంబంధించిన అన్ని మందులు అందుబాటులో ఉన్నాయి. వైద్యులు పనివేళల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించాం. ఏఎన్ఎంలు ప్రతి ఇంటికి వెళ్లి జ్వరబాధితుల వివరాలు నమోదు చేయడంతో పాటు ఆసుపత్రులకు పంపేలా చర్యలు తీసుకోవాలని సూచించాం.

- డాక్టర్ ఈ.బి.దేవి, డీఎంహెచ్‌వో, అనంతపురం

సత్వరమే డి-అడిక్షన్ వార్డు ఏర్పాటు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సత్వరమే డి-అడిక్షన్ వార్డును ఏర్పాటు చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్సు హాలులో నాకోర్డు జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. జిల్లా ఎస్పీ జగదీష్, సహాయ కలెక్టర్ వినూత్నతో కలిసి కలెక్టర్ మాట్లాడారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు ఉపయోగం లేకుండా చూడాలన్నారు. ప్రతి చోటా ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన సభలు పెట్టాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసగా మారడం, వాటి బారిన పడిన వారికి వైద్య చికిత్స అందించేందుకు డి-అడిక్షన్ వార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇప్పటికే కర్నూలు వంటి ప్రాంతాలకు వెళ్తున్నారన్నారు. తగిన వసతి కల్పించేందుకు ఏపీఎంఎస్ఐడీసీ చూసుకోవాలన్నారు. గుంతకల్లు రైల్వే, ఐటీఐ, పాలిటెక్నిక్, జేఎన్‌టీయూ కళాశాల్లో, వసతి గృహాలపై నిరంతరం నిఘా ఉండాలన్నారు. గుంతకల్లు రైల్వే డివిజన్ డీఎస్పీ హర్షిత, ఆర్డీఓ వసంతబాబు, డీటీసీ వీర్రాజు, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీఎంహెచ్ఓ ఈబీ దేవి, సర్వజనాస్పత్రి వైద్య పర్యవేక్షకుడు వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీశ్

(c) eenadu

'అగ్నిపథ్'తో ఉద్యోగావకాశాలు



సదస్సులో వైమానిక దళ అధికారులు సందీప్ సురేంద్రసింగ్, నైపుణ్యాభివృద్ధిసంస్థ అధికారి ప్రతాప్, తదితరులు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: అగ్నిపథ్ పథకం ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని వైమానికదళ అధికారులు సందీప్, సురేంద్రసింగ్ పేర్కొన్నారు. స్కిల్ డెవపల్‌మెంట్, వైమానికదళం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎస్ఎస్‌బీఎన్, ఎస్వీ డిగ్రీ కళాశాలల్లో అగ్నిపథ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిపథ్ పథకం కింద అగ్నివీర్ ఉద్యోగ నియామక ప్రక్రియ జరుగుతుందన్నారు. సైనిక రంగ ఉద్యోగంలో చేరడం వల్ల దేశసేవ చేసే అవకాశం లభిస్తుందన్నారు. దేశ రక్షణరంగంలో ఉద్యోగం చేయడం అదృష్టంగా భావించాలన్నారు. ఇందులో చేరినవారికి నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సేవ చేసే గుణం అలవడుతాయన్నారు. అగ్నివీర్‌లో వైమానిక ఉద్యోగాలకు 17.5 సంవత్సరాల నుంచి 21 సంవత్సరాల వయసు ఉండాలన్నారు. ఇంటర్‌లో 50 శాతం మార్కులు సాధించిన వారు అర్హులు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి పీవీ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

హాకీ.. చిన్నారులు చలాకీ

- జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు
- ఉచితంగా శిక్షణ ఇస్తున్న యువకుడు



జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి పతకాలు అందుకున్న అర్చన, అఖిల్, శ్రుతి, సౌమ్య

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన చిన్నారులు హాకీ క్రీడలో సత్తా చాటుతున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు, ప్రశంసలు అందుకుంటున్నారు. హాకీ క్రీడకు పూర్వ వైభవం తేవాలని.. గ్రామీణ క్రీడారత్నాలను వెలుగులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో పట్టణానికి చెందిన అక్రమ్‌బాషా చిన్నారులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఈయన ప్రస్తుతం బెళుగుప్ప మండలం నరసాపురం సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. స్థానిక కరణం చిక్కప్ప ప్రభుత్వ పాఠశాల ఆవరణలో రోజూ 60 నుంచి 70 మంది బాలబాలికలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. వీరిలో 16 మంది బాలికలు, 20 మంది బాలురు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొని పతకాలు అందుకున్నారు. ఇప్పటికే కళ్యాణదుర్గం నుంచి పలువురు బాలికలు అనంతపురంలోని హాకీ అకాడమికి ఎంపికయ్యారు. దిల్లీలో జరిగిన ఖేలో ఇండియా హాకీ క్రీడల్లో నలుగురు పాల్గొని ద్వితీయ స్థానంలో నిలవడం విశేషం.

భారత జట్టులో ఆడాలన్నదే లక్ష్యం



కళ్యాణదుర్గానికి చెందిన **సనతాజ్** ఓ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. తండ్రి కూలీ పనులు చేస్తూ కుమార్తెను చదువులో, క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. బాలిక రెండేళ్లుగా హాకీలో తర్ఫీదు పొందుతోంది. రాష్ట్రస్థాయిలో రెండుసార్లు పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచింది. భారత జట్టు తరపున ఆడాలని, అదే జట్టుకు ప్రాతినిధ్యం వహించాలన్నదే తన ధ్యేయమని చెబుతుంది.

ఊరికి మంచి పేరు తేవాలని..



పట్టణానికి చెందిన **మహేశ్వరి** కరణం చిక్కప్ప ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. తండ్రి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. బాలిక చదువులో రాణిస్తూనే హాకీలో సాధన చేస్తుంది. జూనియర్ బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొని విజేతగా నిలిచింది. జాతీయ స్థాయిలో రాణించి తల్లిదండ్రులకు, సొంతూరుకు మంచి పేరు తెస్తానని ధీమాగా చెబుతుంది.

పేద పిల్లలను ప్రోత్సహించాలని..




హాకీ క్రీడను మరింత మందికి నేర్పి జాతీయ స్థాయికి తీసుకెళ్లాలన్నదే నా లక్ష్యం. అందులో భాగంగానే మూడేళ్లుగా పేద పిల్లలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నా. క్రీడా దుస్తులు, పరికరాలు సొంతంగా ఏర్పాటు చేస్తున్నా. దాతలు, ఆర్డీటీ సంస్థ నుంచి కొంత ప్రోత్సాహం అందుతుంది. నావద్ద శిక్షణ పొందిన బాలబాలికలు జాతీయ స్థాయిలో నలుగురు, రాష్ట్రస్థాయిలో 36 మంది ప్రతిభ కనబర్చడం సంతోషంగా ఉంది. కళ్యాణదుర్గంలో రాష్ట్రస్థాయి టోర్నీ నిర్వహించాలన్నది నా కల. **- అక్రమ్‌బాషా, హాకీ శిక్షకుడు**

రాష్ట్రస్థాయిలో మూడుసార్లు విజేత..



సాయిప్రజ్ఞ కళ్యాణదుర్గం బాలికోన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతుంది. నాన్న ప్రైవేట్ ఎలక్ట్రీషియన్. ఏడాదిన్నరగా హాకీ క్రీడలో తర్ఫీదు పొందుతుంది. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని మూడుసార్లు విజేతగా నిలిచింది. ప్రభుత్వ ఉద్యోగం సాధించి ప్రజా సేవ చేస్తానని బాలిక చెబుతుంది.

రెండేళ్లుగా శిక్షణ తీసుకుంటూ..



అఖిల్‌కుమార్ కళ్యాణదుర్గం బాలికోన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. రెండేళ్లుగా హాకీలో శిక్షణ పొందుతున్నాడు. తండ్రి ఆటో నడుపుతూ చదువు, క్రీడలో ప్రోత్సహిస్తున్నారు. మూడుసార్లు కళ్యాణదుర్గం తరపున పోటీల్లో పాల్గొన్నాడు. ఉమ్మడి జిల్లాల స్థాయిలో విజేతగా నిలిచి, ఉత్తమ క్రీడాకారుడిగా గుర్తింపు పొందాడు. దేశస్థాయి జట్టుకు ప్రాతినిధ్యం వహించాలన్నదే తన లక్ష్యమని చెప్పాడు.

20 నుంచి అండర్-19 పాఠశాల క్రీడల ఎంపిక పోటీలు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా పాఠశాల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి అండర్-19 విభాగం వివిధ క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సమాఖ్య కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ నెల 20న హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక కొత్తవూరు జూనియర్ కళాశాల మైదానంలో, టెన్నిస్, సాఫ్ట్‌టెన్నిస్ ఎంపిక పోటీలు రుద్రంపేట సమీపంలో ఉన్న టెన్నిస్ అకాడమీలో నిర్వహిస్తారు. త్రోబాల్, టెన్నికాయిట్, క్యారమ్స్ జట్ల ఎంపిక 23న, సైక్లింగ్, మాల్కమ్ జట్ల ఎంపిక 24న కొత్తవూరు జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తామని ఆయన వివరించారు. ఈ నెల 25న ఆర్చరీ జట్లను విద్యారణ్య ఓరియంటల్ పాఠశాలలో, 26న వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలు డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తారు. ఈ నెల 30న ఈత పోటీలు అనంతలక్ష్మి అంతర్జాతీయ పాఠశాలలోని ఈత కొలనులో, నవంబరు ఒకటిన జిమ్నాస్టిక్స్, బాక్సింగ్ జట్ల ఎంపిక డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జరుగుతుందని ఆయన వివరించారు. క్రీడాకారులు తమ ప్రవేశ ఫారాలు, వయసు ధ్రువీకరణతో హాజరు కావాలని సూచించారు.



బత్రేపల్లి భళా

వాయుగుండం ప్రభావంతో ఈ ఏడాది తొలిసారిగా బత్రేపల్లి జలపాతం పారింది. ఆకాశగంగలా ఎత్తైన కొండబండరాళ్ల నుంచి దూకుతూ చూపరులను మంత్రముగ్ధులను చేసేలా కనువిందు చేస్తోంది. ఈ జలపాతం కదిరి - పులివెందుల రోడ్డు నుంచి కేవలం 800 మీటర్ల లోపే ఉంటుంది. అటుగా వెళ్లే ప్రయాణికులు వాహనాలను రోడ్డుపైనే ఆపేసి సెల్ఫీ చిత్రాలు తీసుకుంటూ సందడి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, తలుపుల**

చదరంగంలో జిల్లా విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నీలో జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు పతకాలు కైవసం చేసుకున్నారు. వివిధ విభాగాల్లో క్రీడాకారులు అద్భుత ప్రతిభను ప్రదర్శించి విజయాలు సాధించారు. అండర్-9 బాలికల విభాగంలో ఆరాధ్య ప్రథమ స్థానం సాధించింది. అండర్-15 బాలికల విభాగంలో మహేశ్వరి రాష్ట్రస్థాయిలో రెండోస్థానం సాధించింది. అండర్-7 విభాగంలో వారిణి అర్జున్ ద్వితీయ స్థానం, మయాంక్ 5వ స్థానం, అండర్-11 విభాగంలో సుసాన్ క్లారా మూడో స్థానం సాధించారు. ఉత్తమ మహిళగా ఎస్. పర్వత్ అవార్డు అందుకున్నారు. అండర్-13 బాలుర విభాగంలో మిస్బా ఆరోస్థానం, హన్నీ స్టీఫెన్ ఏడో స్థానం కైవసం చేసుకున్నారు. భరత్ భూషణ్ (9వ స్థానం), ఆదిత్యరెడ్డి (18వ స్థానం), విశ్వనాథ్ (26వ స్థానం)లు రాణించారు. విజయాలు సాధించిన క్రీడాకారులను చెస్ శిక్షకుడు హుస్సేన్, తదితరులు అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించాలని ఆయన పిలుపునిచ్చారు.

నవంబరు 10 నుంచి ఆర్మీ నియామక ర్యాలీ

రాయచోటి: కడప డీఎస్ఏ స్టేడియంలో నవంబరు 10 నుంచి అగ్నివీర్ ఆర్మీ నియామక ర్యాలీ నిర్వహిస్తున్నామని నియామక అధికారి కల్నల్ పునీత్‌కుమార్ పేర్కొన్నారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, కార్యాలయ సహాయకులు, స్టోర్ కీపర్ టెక్నికల్, ట్రేడ్స్‌మెన్ల నియామకానికి దరఖాస్తులు చేసుకుని అడ్మిట్ కార్డులు పొందిన కర్నూలు, నెల్లూరు, అనంతపురం, వైఎస్ఆర్, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, నంద్యాల, బాపట్ల, తిరుపతి, అన్నమయ్య, సత్యసాయి జిల్లా అభ్యర్థులు హాజరుకావాల్సి ఉంటుందన్నారు.

సత్యసాయి సన్నిధిలో కేంద్రమంత్రి మురుగన్

పుట్టపర్తి, న్యూస్‌టుడే : పుట్టపర్తిలోని సత్యసాయి మహాసమాధిని కేంద్ర సమాచార, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి మురుగన్ దర్శించుకున్నారు. శుక్రవారం బెంగుళూరు నుంచి రోడ్డు మార్గంలో ఆయన పుట్టపర్తికి చేరుకున్నారు. శాంతి భవన్ అతిథిగృహం వద్ద మంత్రికి జేసీ అభిషేక్‌కుమార్, ఆర్డీఓ సువర్ణ, ట్రస్టు ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. సాయికుల్వంత్ మందిరంలో మంత్రిని ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ స్వాగతం పలికారు. సత్యసాయి మహా సమాధిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రిని రత్నాకర్ సన్మానించి, బాబా చిత్రపటాన్ని అందజేశారు. సత్యసాయి చెంత సేదతీరితే మానసిక ప్రశాంతత లభిస్తోందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. అనంతరం బెంగళూరుకు రోడ్డుమార్గంలో బయలుదేరి వెళ్లారు. డీఎస్పీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టారు.



మహాసమాధిని దర్శించుకుంటున్న కేంద్ర మంత్రి మురుగన్

APSRTC
SHORT TENDER NOTICE
పల్లె వెలుగు
Tenders are invited through ONLINE ("www.tender.apeprocurement.gov.in") for 1) Removing of Roof Slab and providing Galvalume sheet roofing in waiting Hall (on East side) of Bus Station at Hindupur, Sri Satya Sai District (3rd Call), 2) Re-Construction of leaned Compound wall behind Ladies Rest Room in Bus Depot at Guntakal, Ananthapuramu District (3rd Call), 3) Providing AMF and Tyres Room in Bus Depot at Madakasira, Sri Satya Sai District (2nd Call), 4) Providing Cement Concrete Pavement to drive way behind Annexure Rooms in Bus Depot at Tiruvuru, NTR District.
For full Tender Notice please visit "www.apsrtc.ap.gov.in". For Online participation please visit "https://tender.apeprocurement.gov.in". NOTE: Bid Document down load Start Date & Time: 22.10.2024, 4.00 PM. Bid Submission Closing Date & Time : 28.10.2024, 4.00 PM. Further details: Ph. Nos: 8704544453/9959224686 (10.00 AM to 5.30 PM). APSRTC reserves the right to cancel or reject any tender or all the tenders of the notification without assigning any reason at any stage.
NIT No.05/CCE/APSRTC/2024-25, Dt.15.10.2024 Chief Civil Engineer, APSRTC, Vijayawada

కేజీబీవీ ఉద్యోగాలకు ధ్రువపత్రాల పరిశీలన

ఎస్కేయూ, న్యూస్‌టుడే: కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన ఉద్యోగాలకు అర్హత సాధించిన మహిళా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ శుక్రవారం సమగ్రశిక్షా కార్యాలయంలో చేపట్టారు. సీఆర్టీ 20, పీజీటీ 21, పార్ట్‌టైం బోధకులు 16, వార్డెన్ 7, అకౌంటెంట్ ఉద్యోగాలు 4 ఉన్నాయి. అనంతజిల్లా నుంచి 1877 మంది దరఖాస్తు చేసుకొన్నారు. 1:5 నిష్పత్తి ప్రకారం 334 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. వారిలో 87 మంది గైర్హాజరయ్యారు. సబ్జెక్టుల వారీగా వేరు వేరు బృందాలు ధ్రువపత్రాలు పరిశీలించారు. సీఆర్టీ తెలుగు 3, ఆంగ్లం 4, గణితం 5, భౌతికశాస్త్రం 4, సామాన్య శాస్త్రం 4, పీజీటీల్లో ఆంగ్లం 5, భౌతిక శాస్త్రం 1, రసాయన శాస్త్రం 4, వృక్షశాస్త్రం 1, జంతు శాస్త్రం 1, సివిక్స్ 4, వొకేషనల్ 1, ఎంఎల్‌టీ 1, పూర్వప్రాథమిక ఉపాధ్యాయ 2 పోస్టులున్నాయి. సమగ్ర శిక్ష ఏపీసీ నాగరాజు సమక్షంలో ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ జరిగింది. మౌఖిక, బోధన సామర్థ్య పరీక్షలు నిర్వహించకుండా కేవలం ప్రతిభ ఆధారంగా ఈ ఉద్యోగాలు కల్పిస్తున్నారు. 1:5 నిష్పత్తి ప్రకారం రాష్ట్ర సమగ్రశిక్షా పథకం కార్యాలయంలో అభ్యర్థుల ఎంపిక చేశారు. రాష్ట్ర కార్యాలయం వారు జిల్లాకు పంపిన జాబితా ప్రకారం అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు జిల్లా సమగ్రశిక్షా అధికారులు పిలిచారు. అర్హత జాబితాలో లేని కొందరు అభ్యర్థులు తమకు అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు.


ప్రజలపై ట్రూఅప్ ఛార్జీలు మోపొద్దు!

ఎస్ఈ కార్యాలయం ఎదుట సీపీఎం ఆందోళన



ఎస్ఈ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం (విద్యుత్తు), న్యూస్‌టుడే: ఇంధన సర్దుబాటు పేరుతో ప్రజలపై ట్రూఅప్ ఛార్జీలు మోపకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం ట్రూఅప్ ఛార్జీలను అమలు చేయకూడదని కోరుతూ అనంతపురంలోని విద్యుత్తుశాఖ ప్రధాన కార్యాలయం ఎదుట నిర్వహించిన ఆందోళనలో పాల్గొని మాట్లాడారు. వైకాపా ప్రభుత్వం విద్యుత్తు కొనుగోళ్లలో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిందని గుర్తుచేశారు. అడ్డగోలుగా హిందుజా కంపెనీకి వైకాపా సర్కారు రూ.1234 కోట్లు చెల్లించిందని ఈ అంశంపై పూర్తి స్థాయి విచారణ చేసి బాధ్యతలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైకాపా ప్రభుత్వం ఇష్టానుసారంగా విద్యుత్తు ఛార్జీలు పెంచి ప్రజలపై భారాలు మోపటంతోనే ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పారన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని విద్యుత్తు శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్‌కు నేతలు అందజేశారు. సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, నాయకులు బాలకృష్ణ, ప్రకాష్‌రెడ్డి, మసూద్ వలి, వెంకటేశ్, రాము, లక్ష్మీనారాయణ, ఇర్ఫాన్ పాల్గొన్నారు.



స్కౌట్స్ శిక్షణతో నాయకత్వ లక్షణాలు

లేపాక్షి : విద్యార్థి దశ నుంచే స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో శిక్షణ పొందితే వారిలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడుతాయని జిల్లా కార్యదర్శి గిరిధర్ పేర్కొన్నారు. మండలంలోని పులమతి ఉన్నత పాఠశాలలో సత్యసాయి జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో రాజ్య పురస్కార్, తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంపు నిర్వహించారు. 5 రోజుల పాటు జరిగే ఈ శిబిరంలో జిల్లా వ్యాప్తంగా 163 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. మొదటి రోజు పలు అంశాలపై అవగాహన కల్పించారు. శిబిరం జరిగే 5 రోజులు లేపాక్షి ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్ ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, ప్రసాద్, నాగరాజు, స్కౌట్ మాస్టర్లు అశ్వర్థనారాయణ, నారాయణస్వామి, సతీష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అనుకోని ప్రమాదం.. కార్మికుడికి విద్యుదాఘాతం

అశోక్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: తాగునీటి విభాగంలో పని చేసే గౌరీశంకర్ శుక్రవారం విధులు నిర్వహిస్తూ విద్యుదాఘాతానికి గురై గాయాలపాలయ్యాడు. ఇతను కళ్యాణదుర్గం బైపాస్‌లో సమీపంలో నివాసం ఉంటున్నాడు. 20 ఏళ్లుగా పొరుగు సేవల ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం విధి నిర్వహణలో భాగంగా సుభాష్ రోడ్డు నుంచి కమలానగర్‌లో రెండో క్రాస్‌లో తాగునీటి పైపులైను మరమ్మతు పనులు చేస్తున్నాడు. పైపులైను చివరలో నీరు వెళ్లకుండా మూసివేసే క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పాత టైర్లు, ట్యూబులు ఉండటంతో వాటిని పక్కకు విసిరేశాడు. టైరులో ఉన్న నీరు, నేలపై తేమ ఉండటంతో విద్యుదాఘాతానికి గురై వెనక్కి పడిపోయాడు. శరీరం కాలి తీవ్ర గాయాలపాలయ్యాడు. కింద పడటంతో తలకూ బలమైన గాయమైంది. తోటి కార్మికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కార్మికుడు కోలుకొనే వరకు నగరపాలక అధికారులు వైద్యం అందేలా చూడాలని మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, ఇంజినీరింగ్ విభాగం జిల్లా కార్యదర్శి సంజీవరాయుడు, పోతులయ్యలు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థి దుర్మరణం



చైతన్య

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండకు చెందిన వైద్య విద్యార్థి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన బెంగళూరులో చోటు చేసుకుంది. బాధిత కుటుంబం తెలిపిన వివరాలిలా.. స్థానిక తెదేపా నాయకుడు, రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ నర్రా కేశన్న, మాజీ సర్పంచి నర్రా సుజాత దంపతుల కుమారుడు చైతన్య(23) కర్ణాటకలోని శిమొగ్గలో వైద్య విద్య చివరి సంవత్సరం చదువుతున్నారు. ఆ తర్వాత పీజీ చేయాలనే ఆలోచనతో వివరాలు తెలుసుకునేందుకు రెండురోజుల కిందట బెంగళూరు వెళ్లారు. శుక్రవారం వేకువజామున ద్విచక్ర వాహనంలో తన మిత్రుడు, వైద్య విద్యనభ్యసిస్తున్న విడపనకల్లు మండలం ఆర్.కొట్టాలకు చెందిన గోనుగుంట్ల పూర్ణనందతో కలిసి బయటకు బయల్దేరారు. బెంగళూరులోని సజ్జాపూర్‌లో వెళ్తుండగా అదుపుతప్పి, డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చైతన్యను స్థానికులు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందారు. అతని మిత్రుడికి గాయాలయ్యాయి. ఒక్కగానొక్క కుమారుడి మృతితో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోధించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు బెంగళూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

అదుపుతప్పి ఆర్టీసీ బస్సు బోల్తా



బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, న్యూస్‌టుడే : వడియంపేట గ్రామ శివారులో తెలంగాణకు చెందిన ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డుపక్కన కల్వర్టు కాలువలోకి దూసుకెళ్లింది. హైదరాబాద్‌లోని మియాపూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వెల్దుర్తి దగ్గర టైరు పంక్చర్ కావడంతో ప్రయాణికులను వేరే బస్సులో గమ్యస్థానాలకు పంపారు. అక్కడి నుంచి ఖాళీ బస్సులో డ్రైవర్, క్లీనర్ అనంతపురానికి బయలుదేరారు. వడియంపేట గ్రామశివారుకు రాగానే ప్రయాణికులతో వెళ్తున్న ఆటో అడ్డం రావడంతో బస్సు డ్రైవర్ అత్యంత చాకచక్యంగా తప్పించబోయి బస్సును రోడ్డుపక్కనే ఉన్న కల్వర్టు కాలువలోకి మళ్లించాడు. దీంతో పెద్ద ప్రమాదమే తప్పింది. బస్సు డ్రైవర్ నిఖిల్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తప్పిన ప్రమాదం



సీకే పల్లి మండలం యర్రంపల్లి గ్రామంలో అంగన్‌వాడీ చిన్నారులకు పెద్ద ప్రమాదం తప్పింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అంగన్‌వాడీ కేంద్రం ముందున్న పెద్ద వృక్షం నేలవాలింది. చిగరజాతికి చెందిన వృక్షాలు కావడంతో నేలకొరిగాయని పని వేళల్లో అయితే చిన్నారులకు అపాయం జరిగేదన్నారు. కేంద్రం ప్రహరీలో ఇలాంటి చెట్లు ఉన్నాయని వాటిని తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. చెట్ల తొలగింపుపై చర్యలు తీసుకుంటామని అంగన్‌వాడీ కేంద్ర నిర్వాహకురాలు అలివేలమ్మ తెలిపారు. **- న్యూస్‌టుడే, చెన్నేకొత్తపల్లి**



EENADU Classifieds

BUSINESS SERVICES

WANTED DEALERS/AGENTS

AP ప్రభుత్వంచే ఆమోదం పొందిన ఇసుక లారీ / ట్రాక్టర్లకు GPS అమ్మేందుకు డీలర్లు కావలెను. కంపెనీ వారి సంప్రదింపు నంబర్లు: Volty IoT Solutions 8367307070 9666841234

EDUCATION

DMLT 2 సం: కోర్సునకు అడ్మిషన్లు జరుగుచున్నవి. కొన్ని సీట్లు మాత్రమే కలవు. Q: ఇంటర్ పాస్ (ఏ గ్రూప్ అయిన) # SEEDS కాలేజ్, ATP. 9440255034.

PROFESSIONAL SERVICES

ASTROLOGY

చాముండేశ్వరి జ్యోతిష్యాలయం: శ్రీ పురుషుల గుప్త సమస్యలకు శ్రీ S.దుర్గాప్రసాద్ శాస్త్రిగారు ఫోన్ ద్వారా జ్యోతిష్యం చెప్పబడును. లేక మా ఇంటి అడ్రస్‌కు సంప్ర: 9704392164, 9440489814.

REAL ESTATE

PLOT FOR SALE

అనంతపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీ వెనుక హమాలీకాలనీ సర్వేనం. 322 ప్లాటు నం.326 కార్నర్‌ప్లాటు అమ్మబడును. సంప్ర: వెంకటేశ్వర్‌రెడ్డి, సెల్: 9885763347, 7893403014.

అనంతపురం - RTO Office, Opp ప్లాట్ అమ్మకానికి కలదు. (4.46 Cents) Owner Cell No: 9849581058.

హిందూపురంలో రెడీగా ఇల్లు కట్టుకునే విధంగా డెవలప్ చేసిన మా KVR రియాల్టీ ప్రాజెక్ట్స్‌లో ప్లాట్లు స్పాట్ రిజిస్ట్రేషన్‌గా కలవు. సంప్ర: 6281824204.

బెంగళూరు హైవేలో KLD రోడ్ ఫ్లై ఓవర్ నుండి 10 km దూరంలో పెట్టుబడి కొరకు హైవే వెంచర్‌లో 4 సెంట్ల కొలతలు 30x58 ప్లాట్లు అమ్మకానికి కలవు. Ph: 9550233507

LEASE/ RENT

బళ్ళారి హైవేపై సిండికేట్‌నగర్‌లోని కన్వర్షన్ అయిన 50 సెంట్లు & 75 సెంట్లు ప్లాట్ బాడుగకు ఇవ్వబడును. సెల్: 8639512663, 9900181422.

TO LET

ATP Town in 3 BHK for Rajahamsa MS Heights Apartment in '0' Cross Sainagar, ATP. 1 BHK With Furnished House in Sarada Nagar in 5th Cross ATP. Cell: 7989467119

JOBS

బ్రాహ్మణ వంట వాళ్ళు కావలెను. సంప్రదించండి. శ్రీ మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమము, పెంచలకోన, రాపూరు మండలం, SPSR నెల్లూరు జిల్లా. Ph.No: 97051 86006

ప్రముఖ కంపెనీ Pepsi Co (ఫుడ్) నందు సేల్స్‌మ్యాన్ కావలెను. అర్హత 10 పాస్/ఫెయిల్ జీతం+ ఇన్సెంటివ్. లోకేషన్ అనంతపురం. Ph: 9618969678, 8197870888.

Ahiraa Learning Pvt., Ltd., బిజినెస్ డెవలప్‌మెంట్ లేడీ అసోసియేట్స్ కావలెను. ఇంగ్లీష్, హిందీ, తెలుగు తప్పనిసరి. డిగ్రీ. జీతం: 15,000 + Ince ఇంటర్వ్యూ: అక్టోబర్ 21, 11 am - 2 pm సంప్ర: 8106630124

ఇంటి దగ్గర ఉండి వర్క్‌చేసే గొప్ప అవకాశం. P/T: 20,000/-, F/T: 30,000/- ఆదాయం సంపాదించవచ్చును. ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేదు. Cell: 99482 38555.

ప్రముఖ ప్రైవేటు బ్యాంక్ తరుపున ఏజెన్సీ నందు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఎగ్జిక్యూటివ్స్ కనీస విద్యార్హత 10th నుండి డిగ్రీ వరకు.DRA సర్టిఫికెట్ ఉన్నవారు కూడా Apply చేసుకోవచ్చు. లొకేషన్స్ :కదిరి, అనంతపురం, పుట్టపర్తి, రాయదుర్గం, తాడిపత్రి. సోమశేఖర్ :9110735930

Wanted Ex Service Men at Kasepalli Toll plaza . Sri Sai Enterprises, Anantapur Dist. Contact: 9491449827

FACULTY/ TEACHERS

Smartkidz Pre school, Anantapur is looking for Experienced Female Teachers for Pre school. Contact: 9550334477

HUMAN RESOURCES

Hiring Freshers/Exp for US IT Recruiting at Housing Board Colony, Anantapur. Night shift 6pm to 3.00am. Candidates can apply with their resume: whatsapp: 9908991913.

SECURITY GUARDS

హౌసింగ్ బోర్డు కాలనీ, అనంతపూర్ జాబ్: వాచ్‌మెన్ కావలెను. జీతం: 10,000/- Accommodation ఇవ్వబడును. కాల్: 9908991913

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు
అనంతపురం 8008709788 8008709784
గుంతకల్లు 9963804820
కళ్యాణదుర్గం 8008709785
ధర్మవరం 8008001769
హిందూపురం 8008001642
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

హిందూపురం
• హిందూపురం • పెనుకొండ • మడకశిర


దుస్తులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

క్రీడా దుస్తుల పంపిణీ

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: రేకులకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎన్. నారాయణస్వామి శుక్రవారం పాఠశాలలోని 30 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పదోతరగతి వరకు ఇదే పాఠశాలలో చదివానని, ప్రస్తుతం ఇక్కడికే ఉపాధ్యాయుడిగా రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. హెచ్ఎం గిరిజమ్మ ఉపాధ్యాయుడిని అభినందించారు.

రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

గోరంట్ల, న్యూస్‌టుడే: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న పల్లవి, కళ్యాణి ఎస్‌జీఎఫ్ బాల్‌బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు మాధవీలత శుక్రవారం పేర్కొన్నారు. చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తున్నారని హెచ్ఎం తెలిపారు. పాఠశాల బోధనా సిబ్బంది వారిని అభినందించారు.


ఎంపికైన విద్యార్థినులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ఎంజీఎం పాఠశాలలో శనివారం ట్రినిటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డా.పవార్ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

20న మూర్ఛవ్యాధి నివారణపై..

హిందూపురం: ఈనెల 20న జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూర్ఛవ్యాధి నివారణకు ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక ఆల్‌హిలాల్ పాఠశాలలో ఏర్పాటు చేసినట్లు జేవీవీ జోనల్ అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఈటీ రామ్మూర్తి తెలిపారు.

22న జాబ్ మేళా

హిందూపురం: ఈనెల 22న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతి, యువకులకు జాబ్ మేళాను పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి హరికృష్ణ తెలిపారు. పదోతరగతి, ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ, ఐటీఐ, పీజీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. హాజరయ్యేవారు విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు, వ్యక్తిగత వివరాలు తీసుకురావాలన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

రొళ్ల, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(17) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. దసరా పండగ సందర్భంగా 12వ తేదీన బయటకు వెళ్లిన బాలిక తిరిగి ఇంటికి రాలేదని తండ్రి ఫిర్యాదు చేశారన్నారు.

గోరంట్లలో మహిళ..

గోరంట్ల: గోరంట్లలోని మూడోవార్డుకు చెందిన అఫ్రీన్ అనే మహిళ ఈనెల 13వ తేదీ నుంచి అదృశ్యమైనట్లు తండ్రి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసునమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు.

● వరకట్న వేధింపుల కేసు నమోదు: గోరంట్లలోని శిర్డీసాయి కాలనీకి చెందిన ప్రత్యూష అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై భర్త తారేష్, అత్త నంజమ్మతోపాటు మరో ఆరుగురిపై శుక్రవారం వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు.

ఉరేసుకొని వృద్ధురాలి ఆత్మహత్య

గుడిబండ, న్యూస్‌టుడే: గుడిబండలోని నారాయణాచారి భార్య సువర్ణమ్మ(67) శుక్రవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సువర్ణమ్మకు మధుమేహం, రక్తపోటు, కాళ్లనొప్పులు ఉండడంతో వైద్య చికిత్స తీసుకుంటోంది. నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంది. ఏఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఇంట్లో చోరీ.. బంగారం అపహరణ

హిందూపురం, న్యూస్‌టుడే: గ్రామీణ మండలం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వీవర్స్ కాలనీలో తాళం వేసిన బసవనపల్లి ప్రభుత్వ పాఠశాలలో గుమాస్తాగా పనిచేస్తున్న షేక్‌నజీర్ అహ్మద్ ఇంట్లో చోరీ జరిగింది. ఈ చోరీలో రూ.2లక్షల విలువ చేసే బంగారు నగలు దొంగలు తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. గత నెల 16వ తేదీన ఇతను ఇంటికి తాళం వేసుకొని సోమందేపల్లి మండలం మంచేపల్లికి వెళ్లి తిరిగి వచ్చి చూడగా ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించామని ఈ విషయాన్ని గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. చోరీపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి కేసులో మహిళకు రిమాండు

రొద్దం, న్యూస్‌టుడే : శేషాపురం గ్రామంలో శ్రీనివాసురెడ్డి అనే రైతుపై దాడి చేసిన కేసులో నిందితురాలికి కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్సై నరేంద్ర తెలిపారు. గత నెల 30న గ్రామంలో శ్రీనివాసరెడ్డికి చెందిన దానిమ్మతోటలోకి వసుంధర అనే మహిళకు చెందిన పశువులు వెళ్లి మొక్కలను నష్టపరిచాయి. సంబంధిత రైతు పశువుల కాపరితో గొడవ పడ్డాడు. విషయం తెలుసుకున్న వసుంధర, ఆమె కుమారుడు యేగిరెడ్డిలు రైతుపై దాడిచేసి గాయపరిచారు. రైతు ఫిర్యాదు మేరకు రొద్దం పోలీసులు కేసు నమోదైంది. శుక్రవారం నిందితురాలిని అరెస్టు చేసి పెనుకొండ కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండు విధించినట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ నిర్ణయం.. జనంలో ఆనందం

● చెత్త పన్ను రద్దుతో ఉపశమనం ● ఏడాదికి రూ.3.60 కోట్ల ఆదా

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: మధ్యయుగంలో దేశంలో అప్పటి పాలకులు రకరకాల పన్నులు విధించేవారు. ఇందులో జుట్టు పెంచుకొన్నా, దాని మీద సైతం పన్ను వేసేవారు. అలాగే తుగ్లక్ పాలకులను ఆదర్శంగా తీసుకొన్న వైకాపా ప్రభుత్వం మూడేళ్ల కిందట పట్టణ ప్రజలపై చెత్త పన్ను భారాన్ని మోపింది. పట్టణాల్లో గత 10-15 సంవత్సరాలుగా ఇంటింటి చెత్త సేకరణ జరుగుతోంది. తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా సేకరణ రెండు బుట్టల పద్ధతిని దశాబ్ద కాలంగా అనుసరిస్తున్నారు. వైకాపా ప్రభుత్వమే కొత్తగా ఇంటింటి చెత్త సేకరణకు శ్రీకారం చుట్టినట్లు, క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) పేరుతో జగన్ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. ఇంటింటా చెత్త సేకరణకు ఓ ఏజెన్సీని నియమించి, వారితో ఆటోలు కొనుగోలు చేయించింది. ఒక్కో ఆటోకు నెలకు రూ.62 వేలు మున్సిపాల్టీ చెల్లించాలని శాసించింది. ఈ సొమ్ము చెల్లింపునకు చెత్త పన్ను పేరుతో ప్రజలపై భారం మోపింది. పేద నివాసిత ప్రాంతాలైన స్లమ్ ఏరియాలను వదిలి పెట్టలేదు. అలాంటి ప్రాంతాల్లో ఇంటికి నెలకు రూ.60, మిగిలిన ప్రాంతాల్లో రూ.120 వసూలు చేసేలా ఉత్తర్వులు జారీ చేసింది. గతం కన్నా చెత్త సేకరణలో నూతనంగా ఎలాంటి మార్పు రాకపోయినా, ప్రజలు చెత్త పన్ను చెల్లించక తప్పలేదు. పట్టణంలో 26 ఆటోలతో చెత్త సేకరణ చేయించారు. ప్రతి నెలా దాదాపు ప్రజలపై రూ.30 లక్షలు భారం మోపారు. ప్రజలు అదనంగా సేవలు అందక పోవడంతో పన్ను చెల్లింపును నిరాకరించారు. దీంతో వసూలు భారాన్ని సచివాలయాలకు అప్పగించారు. వారు వసూలు చేయలేక చేతులెత్తేయడంతో వృద్ధులకు ఇచ్చే పింఛన్ల సొమ్ములో నుంచి మినహాయించుకోవడం, ఆస్తి పన్నుతో పాటు వసూలు చేయడం తదితర పనులకు దిగారు. ప్రజల బాధలను గుర్తించిన చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే చెత్త పన్ను రద్దు చేస్తామని ప్రకటించారు. తాజాగా రెండు రోజుల క్రితం నిర్వహించిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో అధికారంలోకి వచ్చాక చెత్త పన్ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అందుకు అనుగుణంగా పురపాలక శాఖ ఉత్తర్వులు విడుదల చేస్తోంది. దీంతో పట్టణ వాసులకు ఉపశమనం కలిగింది. ఏడాదికి రూ.3.6 కోట్లు పన్ను భారం తప్పింది. ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు చెత్త పన్ను వసూలు చేయడం లేదని పేర్కొన్నారు.

- పట్టణం: హిందూపురం
- జనాభా: 1,76,000
- నివాసాల సంఖ్య: 44 వేలు
- చెత్త పన్ను: ప్రాంతాన్ని ఒక్కో నివాస భవనానికి రూ.60 నుంచి రూ.120
- ప్రతి నెలా వసూలు చేస్తున్నది : రూ.30 లక్షలు
- రద్దుతో ఏడాదికి ఆదా : రూ.3.60 కోట్లు


మున్సిపల్ కార్యాలయం

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)

హిందూపురం: 80085 73018, పెనుకొండ: 91000 20922, మడకశిర: 76759 19016

సమస్య: మండలపల్లిలో దోమల బెడద అధికంగా ఉంది. -మంజునాథ్

సమస్య: కేకేపాళ్యం ఇందిరమ్మ కాలనీలో రోడ్లపై మురుగు పారుతోంది. -శ్రీదేవి

సమాధానం: ఫాగింగ్ చేయిస్తాం. పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రం చేయిస్తాం. -నాగరాజునాయక్, ఈఓఆర్‌డీ. -న్యూస్‌టుడే, గుడిబండ

సమస్యల పరిష్కారం: గుడిబండ: తాళికెర నుంచి గొల్లపల్లికి వెళ్లే మట్టి రోడ్డును ఈఓఆర్‌డీ నాగరాజునాయక్ చదును చేయించారు. చిగతుర్పులో నీటి సమస్య ఉండగా మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు బోరు తవ్వించి నీటి సమస్య పరిష్కరించారు. కొగిర్యపాళ్యంలో గుడిబండ పంచాయతీ కార్యదర్శి ప్రకాశ్ వీధి దీపాలు ఏర్పాటు చేసి అంధకారం తొలగించారు. కేకతి నీటి ట్యాంకు వద్ద నీరు వృథాగా పోతుండగా ఈఓఆర్‌డీ నాగరాజునాయక్ విరిగిన పైపును మరమ్మతు చేయించారు.

స్పందన వందనం

సమస్య: సోమందేపల్లి మండలం పందిపర్తిలో రెండు వారాలుగా విద్యుత్తు కోతలు అధికమయ్యాయి. -లోకేశ్‌రెడ్డి


సమాధానం: అంతరాయం ఏర్పడకుండా చర్యలు చేపడతాం. -పరమేశ్వరరెడ్డి, ఏఈ, సోమందేపల్లి. -న్యూస్‌టుడే, పెనుకొండ

సమస్య: హెచ్.ఆర్.పాళ్యం బీసీ కాలనీలో తాగునీటి పైపుల లీకేజీతో రోడ్లపై మురుగు నిల్వ ఉంటోంది. -వెంకటేశ్

సమాధానం: హరితరాయబారుల ద్వారా మురుగు తొలగిస్తాం. -వరదరాజు, పంచాయతీ కార్యదర్శి. -న్యూస్‌టుడే, మడకశిర గ్రామీణం

చెరువుకట్ట కాలువ అధ్వానం

బాలాజీ నగర్ (హిందూపురం గ్రామీణం), న్యూస్‌టుడే: హిందూపురం పురపాలక సంఘం పరిధిలోని బాలాజీనగర్ సమీపంలో వెళ్లే కొట్నూరు చెరువు కట్ట కాలువలో అపరిశుభ్రం తాండవిస్తోంది. దీంతో ఆ ప్రాంతమంతా దోమలు, పందుల ప్రభావంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఈ కారణంగా పరిసరాల్లోని నిర్వాసితులు అనారోగ్యాలకు గురవుతూ ఇబ్బందులెదుర్కొంటున్నారు. కాలువలో నిలువ ఉన్న మురుగు, చెత్తాచెదారం తొలగించడంలో అటు మున్సిపల్ అధికారులు, ఇటు నీటిపారుదలశాఖ అధికారులూ పట్టించుకోవడంలేదనే విమర్శలున్నాయి. వీరే స్పందించకపోతే ఇంకెవరు వచ్చి ఈ సమస్య పరిష్కరిస్తారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులును వివరణ కోరగా మురుగు నీరు బయటి ప్రదేశానికి పంపి శుభ్రతా పనులు చేపడతామన్నారు. పందుల యజమానులకు నోటీసులు జారీ చేస్తామన్నారు.


బాలాజీనగర్ సమీపంలో కట్టకాలువలో మురుగునీరు ఇలా..

స్కేటింగ్‌లో చిచ్చర పిడుగు

హిందూపురం అర్బన్(టీచర్స్ కాలనీ), న్యూస్‌టుడే: ఆ బుడతడి వయసు ఏడేళ్లు. చదువుతున్నది రెండో తరగతి. అయితే స్కేటింగ్‌లో నైపుణ్యం సాధించి అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు. హిందూపురం పట్టణంలోని టీచర్స్‌కాలనీకి చెందిన ఎన్. యూనస్, తబసుమ్‌ల కుమారుడు ఎన్. మజ్(7) చదువుల్లో కూడా మంచి ఉత్తీర్ణత సాధిస్తున్నాడు. యూట్యూబ్‌లో చిన్నారులు స్కేటింగ్‌లో ప్రతిభ సాధిస్తున్నారని నేను కూడా స్కేటింగ్ నేర్చుకోవాలన్న ఆలోచన కలిగింది. తల్లిదండ్రుల సహాయంతో యూట్యూబ్‌లో ఇచ్చిన శిక్షణ ఏకాగ్రతతో విని ఇంటి సమీపంలో స్కేటింగ్ చేయడం మొదలుపెట్టాడు. ఆదే విధంగా ఏడాదిపాటు కొనసాగించాడు. ఆత్మవిశ్వాసం, పట్టుదలతో ఇప్పుడు ఎంతో రద్దీ ప్రదేశంలోనూ సునాయసంగా స్కేటింగ్ చేస్తూ రహదారిలో వేగనిరోధకాలు ఉన్నప్పుడు బ్రేకులు వేస్తూ ముందుకెళ్తున్నాడు. చిన్నారి 'పురం'లో స్కేటింగ్ చేస్తూ ముందుకెళ్లడంతో ఆ చిన్నారి చూసిన ప్రజలంతా ఆశ్చర్యపడుతున్నారు. ఇటీవల యలహంక నుంచి దొడ్డబళ్లాపురం వరకు భయపడకుండా 30 నిమిషాల్లో చేరుకున్నాడని తండ్రి తెలిపారు.


చిన్నారి మజ్

కాలం చెల్లిన కందిపప్పు సరఫరా

రొళ్ల, మడకశిర, న్యూస్‌టుడే: మండలంలోని ఆవినకుంట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి కాలం చెల్లిన కందిపప్పును డీలర్ దయానంద్ సరఫరా చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త కందిపప్పు ప్యాకెట్లను బాలింతలు, గర్భిణులకు పంపిణీ చేశారు. వారు ఇంటికెళ్లి చూసుకొని అందులో పురుగులు ఉండటంతో అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని అంగన్‌వాడీ కార్యకర్త ఐసీడీఎస్, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించడంతో వారు తనిఖీ చేశారు. కాలం చెల్లినదని తేలడంతో డీలర్‌ను విచారించి వాటిని ఎందుకు సరఫరా చేశారని ప్రశ్నించారు. డీలర్ మాట్లాడుతూ పొరపాటున స్టాకు పాయింట్ నుంచి సరఫరా చేశారని వాటినే కేంద్రాలకు పంపిణీ చేశామన్నారు. ఈ విషయమై ఆర్ఐ మంజునాథ్‌రావు వివరణ కోరగా నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించామన్నారు.

బ్యాంకులో విద్యుదాఘాతం

పెనుకొండ, న్యూస్‌టుడే: స్థానిక యాక్సిస్ బ్యాంకులోని సర్వర్ గదిలో శుక్రవారం రాత్రి విద్యుదాఘాతానికి మంటలు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక కేంద్రం ఇన్‌ఛార్జి రంగనాథం సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ఆయన తెలిపిన వివరాల మేరకు సిబ్బంది వెంటనే అప్రమత్తం అవ్వడంతో పెనుప్రమాదం తప్పిందని, కేవలం సర్వర్‌గదిలోనే మంటలు రేగడంతో రూ.2లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు.

బాలుడి ఆచూకీ లభ్యం

సోమందేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక సాయినగర్ కాలనీకి చెందిన మూడో తరగతి విద్యార్థి జయకృష్ణ శుక్రవారం ఉదయం తల్లిదండ్రులకు చెప్పకుండా కనిపించకుండా పోయాడు. తమ ఇంటి పక్కనే పూర్తిస్థాయి నీటితో నిండిపోయిన చెరువు మరువ పారుతుండటంతో లక్ష్మి, రవి దంపతులు, బంధువులు, కాలనీ వాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఎస్సై రమేశ్‌బాబు, హెచ్‌సీ సుధాకర్, తమ పోలీస్ సిబ్బంది, తల్లిదండ్రులు, కాలనీ వాసులతో కలిసి చెరువు చుట్టూ గాలించారు. చెరువు నీటిలో ఆడుకొనేందుకు, ఈతకు వెళ్లి..మునిగిపోయి ఉంటాడేమోనని వారంతా అనుమానాలు వ్యక్తం చేస్తూ నీటిలోను గాలింపు చేపట్టారు. చివరకు సాయంత్రం 5 గంటల తర్వాత క్షేమంగా ఉన్న బాలుడి ఆచూకీ లభ్యం కావడంతో అందరూ ఊపిరి పీల్చుకొన్నారు.

మట్టి రోడ్లు.. బురదమయం



రొళ్ల మండలం కాకి ఎస్సీ కాలనీలో మట్టి రోడ్డు బురదమయంగా మారింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మట్టి రోడ్లపై నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని కాలనీవాసులు వాపోతున్నారు. ఈవిషయంపై ఎంపీడీవో ప్రసాద్‌ను వివరణ కోరగా పల్లె పండగ కార్యక్రమంలో ఇలాంటి వాటిని గుర్తించి సీసీ దారులు ఏర్పాటు చేస్తామన్నారు.

-న్యూస్‌టుడే, రొళ్ల

రహదారులపై తొలగని చెత్త..



మడకశిర పట్టణంలోని రాజీవ్‌గాంధీ కూడలిలో కొద్ది రోజుల నుంచి చెత్త తొలగించక పోవడంతో రోడ్డు పైకి వచ్చింది. చెత్తలో మేకలు, పందులు, పశువులు పొర్లుతుండటంతో చెత్త చెల్లా చెదురుగా పడిపోయింది. మార్కెట్‌కు వచ్చే వ్యాపారులు, కొనుగోలుదారులకు ఇబ్బందిగా మారింది. ఈ విషయమై మున్సిపల్ ఏఈ మురళీధర్‌ను వివరణ కోరగా వెంటనే తొలగిస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, మడకశిర

డంపింగ్ యార్డు మార్చాలని ఆందోళన

గోరంట్ల: ఎముకల గుట్టపల్లి సమీపంలో ఏర్పాటుచేసిన జగనన్న లేఅవుట్‌కు ఆనుకుని చెత్త వేస్తున్నారని, కాలనీలో ఎవరూ నివాసం ఉండడంలేదని జిల్లా వ్యవసాయకార్మిక సంఘం ఆధ్వర్యంలో బాధితులు శుక్రవారం ఎంపీడీవో నరేంద్రకుమార్‌కు వినతి అందజేశారు. ఉదయం కార్మిక సంఘం సభ్యులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. దుర్వాసన, మాంసపు వ్యర్థాలు, మరోవైపు శ్మశానవాటికి అన్ని కాలనీకి దగ్గరలోనే ఉండడంతో ఇక్కడ నివాసం ఉండడం ఎలా సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో సమాధానం ఇచ్చిపంపారు. ఆసంఘం ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు వెంకటేశులు పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.


చెత్తను చూపుతున్న బాధితులు, వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు

ట్రూఅప్ ఛార్జీల విధానాన్ని రద్దు చేయాలి

హిందూపురం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం ట్రూఅప్ ఛార్జీల పేరుతో విద్యుత్తు వినియోగదారులపై భారం మోపితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా అదే విధంగా భారం మోపేందుకు సిద్ధమవుతోందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జడ్పీ శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం ఈ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విద్యుత్తు ఈఈ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి ఏఈ కృష్ణవేణికి వినతిపత్రం అందించారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి, సీఐటీయూ నాయులు రాము, సదాశివరెడ్డి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

చెట్టు విరిగి.. తీగలపై పడి

రొద్దం, న్యూస్‌టుడే : ఎంకొత్తపల్లిలోని ప్రధాన రహదారి పక్కనే ఉన్న చెట్టు గాలి వానకు సమీపంలోని 11 కేవీ తీగలపై పడింది. పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో సమీప గృహాల వారు భయభ్రాంతులకు గురయ్యారు. స్థానిక సర్పంచి చిన్నక్క కూమారుడు నాగరాజు స్పందించి వెంటనే విద్యుత్తు శాఖ అధికారులకు సమాచారం అందించడంతో సరఫరా నిలిపేశారు. తిరిగి శుక్రవారం ఉదయం తెగిన తీగల మరమ్మతులకు సిబ్బంది చర్యలు చేపట్టారు.

చెరువు లీకేజీకి మరమ్మతులు

గోరంట్ల: మండలంలోని మల్లాపల్లి చెరువు లీకేజీ ఎట్టకేలకు శుక్రవారం ఆగిపోవడంతో ఆపరిధిలోని రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మంత్రి సవిత ఆదేశాలతో నాలుగు రోజులుగా తెదేపా నాయకుడు నరేష్ ఆధ్వర్యంలో మరమ్మతు పనులు కొనసాగించారు. సర్పంచి శివానంద తనవంతు కృషి చేశారు. నీటిపారుదల శాఖ డీఈఈ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో పనులు చేపట్టారు.

కొలతల్లో తేడా లేకుండా చూడండి

రొళ్ల : రేషన్ కార్డుదారులకు అందిస్తున్న సరకులను కొలతల్లో ఎలాంటి తేడా లేకుండా లబ్ధిదారులకు పంపిణీ చేయాలని హిందూపురం లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం చౌకదుఖాణాల తూనికలను పరిశీలించి సీల్ వేశారు.

రీసర్వే సమస్యలు వెంటనే పరిష్కారం



ఉప తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బాధితులు

గోరంట్ల, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా రీసర్వే సందర్భంగా ఏర్పడిన సమస్యలు ఇక్కడే పరిష్కారం చేయడానికి ప్రభుత్వం వీలుకల్పించిందని తహసీల్దార్ మారుతి పేర్కొన్నారు. పాలసముద్రం పంచాయతీ కాటేపల్లిలో శుక్రవారం రీసర్వే గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా రైతుల ఎదుర్కొంటున్న సమస్యలు విన్నారు. ముఖ్యంగా ఒక సర్వేనంబరకు సంబంధించి ఉన్నరైతులందరికి అకే ఎల్‌పీ నంబరు ఇవ్వడంతో బ్యాంకురుణాలు నవీకరణ, ఈ-క్రాప్‌బుకింగ్ సమయాల్లో చాలా ఇబ్బంది పడినట్లు రైతులు తహసీల్దార్‌కు వివరించారు. ప్రస్తుతం ఎల్‌పీ నంబరు విడదీసీ రైతులకు ఇబ్బంది లేకుండా ఇక్కడే చేస్తామని తహసీల్దార్ సమాధానం ఇచ్చారు. మండల సర్వేయర్ తాతయ్య, వీఆర్వో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రొద్దం, న్యూస్‌టుడే : భూ రీసర్వేలో వచ్చిన భూ సమస్యలను సత్వరమే పరిష్కరించుకోవాలని తహసీల్దార్ నాగేంద్ర పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రెడ్డిపల్లి గ్రామసచివాలయంలో రెవెన్యూ అధికారల ఆధ్వర్యంలో రైతు భూ సమస్యలపై సదస్సు నిర్వహించారు.

భూ రీసర్వేలో తప్పిదాలపై రైతుల ఫిర్యాదులు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపల్లిలో గత ప్రభుత్వ హయాంలో రెవెన్యూ, సర్వే అధికారులు చేపట్టిన భూ రీసర్వేలో చోటుచేసుకొన్న తప్పిదాలపై గ్రామసభలో పలువురు రైతులు ఉప తహసీల్దార్ రెడ్డిశేఖర్‌కు ఫిర్యాదులు అందజేశారు. ఈ రెవెన్యూ గ్రామంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ భూరీసర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప తహసీల్దార్ మాట్లాడుతూ బాధిత రైతులు తమవద్ద ఉన్న ఆధారాలతో కూడిన పత్రాలను వినతుల రూపంలో అందజేస్తే, రికార్డులను పరిశీలించి తప్పక న్యాయం చేస్తామని రైతులకు చెప్పారు. బాధిత రైతులు తమ వద ఉన్న ఆధారాలతో వినతి పత్రాలు అందజేశారు.

● గ్రామసభలు ఇలా..

19న శనివారం బ్రాహ్మణపల్లిలో, 21న చల్లాపల్లి, 22న వెలగమేకలపల్లి, 23న వెలిదడకల, 24న బుస్సయ్యగారిపల్లి, 25న చెన్నాపురం, 26న కేతగానిచెరువు, 27న గుడిపల్లి, 28న నాగినాయనిచెరువు, 29న పందిపర్తి, 30న చాలకూరు తదితర గ్రామాల్లో ఉంటాయని ఉప తహసీల్దార్ పేర్కొన్నారు.


సమస్యలపై రైతులతో విచారిస్తున్న తహసీల్దార్ మారుతి

ఉప తహసీల్దార్‌కు బాధ్యతలు

చిలమత్తూరు : మండల తహసీల్దార్ బాధ్యతలను ఉప తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న యూనస్‌బాబుకు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో తహసీల్దార్ల కొరత ఉండటంతో మండలానికి ఎవరినీ నియమించలేదు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతండటంతో ఉప తహసీల్దార్‌కు అప్పగించారు.

3 కిలోమీటర్లు..

బైపాస్ రోడ్డు ఛిద్రం.. పట్టణ ప్రజలకు కష్టం

30 గుంతలు

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: హిందూపురం పట్టణంలో రాకపోకలకు బైపాస్ రహదారి ప్రధానమైనది. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు కీలకమైన ఈ రహదారిని గత ప్రభుత్వం ఐదేళ్లు పట్టించుకోలేదు. పట్టణంలోని పలు ప్రాంతాలకు రాకపోకలకు ఈ రోడ్డును మొదట్లో నిర్మించారు. అయితే పట్టణం మీదుగా బెంగళూరుకు వెళ్లే పెద్దపెద్ద రవాణా వాహనాలను, లారీలను పట్టణం లోపలకి రాకుండా, ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఎదురుకాకుండా చూసేందుకు 2010లో ఈ రహదారిని విస్తరించడంతోపాటు పాల డెయిరీ వద్ద నుంచి బసవనపల్లి సర్కిల్ వరకు అదనంగా నిర్మించారు. దాదాపు 5 కిలోమీటర్లు ఉన్న ఈ రహదారిలో ఏకంగా 30కి పైగా గుంతలు ఉన్నాయి. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం గుంతలు పూడ్చడానికి పైసా మంజూరు చేయకపోవడంతో రాకపోకలు నరకప్రాయంగా మారాయి. పట్టణంలోని రహమత్‌పురం, ఆర్టీసీ కాలనీ, త్యాగరాజ్ నగర్, రైల్వేగేటు కింద ఉన్న డీబీ కాలనీ, శ్రీకంఠపురం, మోడల్‌కాలనీ, డి.ఆర్.కాలనీ, లక్ష్మీపురం తదితర ప్రాంతాలకు ఈ రోడ్డు మీదుగా వెళ్లాల్సిందే. బెంగళూరు, లేపాక్షి, చిలమత్తూరు, కొడికొండ చెక్‌పోస్టు వైపు వెళ్లే రవాణా వాహనాల రాకపోకలకు ఇదే మార్గం. ఇంతటి ముఖ్యమైన రహదారిని పట్టించుకోకపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన బైపాస్ రహదారి మరమ్మతులకు నిధులు మంజూరు కాకపోవడం, ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు నిలిచి మరిన్ని గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులకు మరిన్ని కష్టాలు తప్పడం లేదు.


రహదారి నిండా గుంతలే..

ప్రతిపాదనలు పంపాం

గుంతలు పడిన విషయాన్ని గుర్తించాం. రహదారి పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం ఆమోదం తెలిపింది. నిధులు విడుదల కాగానే, టెండర్లు పిలిచి, రోడ్డు వేయిస్తాం.

-మోహన్, రహదారులు భవనాల శాఖ, హిందూపురం

అప్రమత్తతతోనే రోగాలు దూరం

గోరంట్ల, న్యూస్‌టుడే: అప్రమత్తంగా ఉంటే రోగాలు దరిచేరవని జిల్లా మలేరియా అధికారి కళ్లాయప్పనాయక్ పేర్కొన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యార్థులు రోగాలు బారిన పడకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో డీఎంవో ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎంవో మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, తద్వారా దోమలార్వా చనిపోతుందని తెలిపారు. ఎవర్షాకాలం నేపథ్యంలో ఇంటి పరిసరాల్లో నీటినిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. జిల్లా సహాయ మలేరియా అధికారి లక్ష్మీనాయక్, పాఠశాల హెచ్ఎం మాధవీలత, వైద్యాధికారి వాసు, హిందూపురం యూనిట్ మలేరియా సిబ్బంది శివన్న, గంగాధర్, గోపి వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి

రూ.1.30 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో శుక్రవారం నిర్వహించిన పల్లె పండగ పంచాయతీ వారోత్సవాల్లో రూ.1.30 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సంతేబిదనూరు పంచాయతీలో 4 రోడ్లకు రూ.60లక్షలు, బేవనహళ్లి పంచాయతీలో ఏడింటికి రూ.70లక్షలను వెచ్చిస్తున్నారు. ఎంపీడీవో సరస్వతి, పంచాయతీరాజ్ ఇంజినీర్ హనుమేనాయక్, ఏపీవో లలితాకుమారి, మాజీ సర్పంచి శ్రీరాములు, సింగల్‌విండో మాజీ అధ్యక్షుడు ఆనందకుమార్, తెదేపా నాయకులు పాల్గొని శంకుస్థాపన చేసి రోడ్ల పనులను ప్రారంభించారు.


సంతేబిదనూరులో పనులు ప్రారంభిస్తున్న అధికారులు

(c) eenadu

పుట్టపర్తి

• పుట్టపర్తి • ధర్మవరం • కదిరి • రాప్తాడు

స్వర్ణకారుల సంబరాలు



కేకు కోస్తున్న స్వర్ణకారుల వ్యాపారుల సంఘం అధ్యక్షుడు ఖలీల్ రహిమాన్

ధర్మవరం: స్వర్ణకారుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంపవర్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై శుక్రవారం ధర్మవరం పట్టణంలో స్వర్ణకారుల వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. స్థానిక అంజుమన్ కూడలి వద్ద ఆ సంఘం అధ్యక్షుడు ఖలీల్ రహిమాన్ కేకు కోశారు. స్వర్ణకారులకు సీఎం చంద్రబాబు అండగా నిలిచి స్వర్ణకారుల అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షుడు ప్రకాశ్‌రావు, కార్యదర్శి మురళి, గోవిందరాజులు, అనిల్, షామీర్, సతీశ్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక పనులకు దూరంగా ఉండండి

తనకల్లు, న్యూస్‌టుడే : చట్టవ్యతిరేక పనులకు దూరంగా ఉండి ప్రశాంత జీవనం సాగించాలని కదిరి గ్రామీణ సీఐ నాగేంద్ర సూచించారు. శుక్రవారం తనకల్లు పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గొడవలు, నేరాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని ఆయన వారికి హెచ్చరికలు చేశారు. ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మాట్లాడి నేరాల నియంత్రణలో కఠినంగా ఉండాలని సీఐ పోలీసు సిబ్బందికి సూచించారు.

22 నుంచి మొబైల్ ఆధార్ సేవలు

ధర్మవరంపట్టణం : ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు ప్రతి సచివాలయంలో మొబైల్ ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని ఎంపీడీఓ సాయిమనోహర్ తెలిపారు. మొబైల్ ఆధార్ వారోత్సవాల్లో భాగంగా నాలుగు రోజులు శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. కొత్తగా ఆధార్ నమోదు చేసుకునేందుకు ఈ సేవలు వినియోగించుకోవాలని సూచించారు.

వరద బాధితులకు సాయం

బత్తలపల్లి, న్యూస్‌టుడే : విజయవాడలో గత నెలలో వచ్చిన వరదల కారణంగా నష్టపోయిన ప్రజలను ఆదుకోవడానికి బత్తలపల్లికి చెందిన విజ్ఞాన భారతి విద్యాలయ కరస్పాండెంట్ వెంకటకృష్ణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50 వేలు విరాళం అందజేశారు. శుక్రవారం విజయవాడలోని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు రూ.50 వేలు చెక్కును అందజేశారు.

మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు వినతి

ధర్మవరం, న్యూస్‌టుడే : రాయలసీమలో మహిళలకు ప్రత్యేక ఇంజినీరింగ్ కళాశాల ధర్మవరంలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్‌ను రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం కోరారు. లేఖ, సమగ్ర ప్రాజెక్టు నివేదికను అందజేశారు. ధర్మవరంలో ప్రత్యేకంగా మహిళల కోసం ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని అనంతపురం జేఎన్‌టీయూ ప్రతిపాదించిందని మంత్రి లోకేశ్‌కు ఆయన వివరించారు.

పౌరసరఫరాల గోదాము తనిఖీ

ధర్మవరం : ధర్మవరం మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న పౌరసరఫరాల గోదామును శుక్రవారం ఆర్డీఓ మహేశ్ తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను, వివరాలను పరిశీలించారు. గోదాములో ఉన్న రేషన్ బియ్యం బస్తాలను తూకం వేయించారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని అధికారులను ఆర్డీఓ ఆదేశించారు.

సౌకర్యాలకు దూరం.. సమస్యలకు నిలయం

• పట్టణ శివారు కాలనీల్లో ప్రజల అవస్థలు



కేతిరెడ్డి కాలనీలో ప్రతి ఇంటి వద్ద ఏర్పాటు చేసుకున్న నీటి డ్రమ్ములు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే : ధర్మవరంలోని శివారు కాలనీలైన ఇందిరమ్మ, కేతిరెడ్డి ఎల్-1, ఎల్-2, ఎల్-3, ఎల్-4, లక్ష్మీచెన్నకేశవపురం, ఎర్రగుంట, గూడ్స్ షెడ్ కొట్టాల కాలనీల్లో సమస్యలు తిష్టవేశాయి. గత వైకాపా కాలంలో ఈ కాలనీల అభివృద్ధిపై పాలకులు, అధికారులు దృష్టి సారించలేదు. ఫలితంగా తాగునీరు, మురుగు కాలువలు, విద్యుత్తు, రోడ్లు వంటి సదుపాయాలు సమకూరలేదు. దీంతో స్థానికులు ఆయా సమస్యలతో అవస్థలు పడుతున్నారు. వైకాపా పాలనలో శివారు కాలనీల్లో అంగుళం మేర సీసీ రోడ్డు నిర్మించిన దాఖలాలు లేవు. ఈ కాలనీలకు కౌన్సిలర్లు ఉన్నా సమస్యలను ఎవరూ పట్టించుకోలేదని విమర్శిస్తున్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సమస్యల ప్రస్తావన తప్ప ఏ చిన్న పని చేపట్టింది లేదని ప్రజలు వాపోతున్నారు. ఇంటి పన్నులు వసూలు చేస్తున్నా రహదారులు, కాలువలు నిర్మించే లేదని వారు మండిపడుతున్నారు. శివారు కాలనీల్లో మట్టిదారులే ఉన్నాయి. వర్షాలు కురిసినప్పుడు అవి అధ్వానంగా మారుతున్నాయి.

నాలుగైదు రోజులకోసారి మంచినీరు

పట్టణంలోని శివారు ప్రాంతాల్లో తాగునీటి పైపులు విస్తరించలేదు. దీంతో 4, 5 రోజులకోసారి తాగునీటిని మున్సిపల్ అధికారులు సరఫరా చేస్తున్నారు. దీంతో ఇబ్బందులు కష్టాలు కొనుగోలు చేసి తాగునీటి అవసరాలు తీర్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వినియోగించుకునేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు. విద్యుత్తు సరఫరా అంతంత మాత్రమే ఉంటోంది. వీధి దీపాలు వెలగకపోవడంతో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. కుక్కలు, పందుల బెడద అధికంగా ఉంది.



ఇందిరమ్మ కాలనీలో మట్టిరోడ్డే..

పనులు చేపట్టేందుకు చర్యలు

పట్టణ సమస్యలపై దృష్టిసారించాం. శివారు కాలనీల్లో తాగునీరు, రోడ్ల నిర్మాణాలపై ప్రణాళిక రూపొందిస్తాం. ప్రభుత్వానికి నివేదించి నిధుల మంజూరుకు కృషి చేస్తాం. పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

- ప్రమోద్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, ధర్మవరం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

పుట్టపర్తి: 80085 73039, కదిరి: 80085 73033, ధర్మవరం: 99596 98222



సమస్య : పెద్దచిగుళ్లరేవు గ్రామం శివారు కాలనీల్లో రోడ్డుకు ఆనుకుని కంపచెట్లు ఏపుగా పెరగడంతో పరిసరాలు అధ్వానంగా మారాయి. దీంతో విషసర్పాలు ఇళ్లదగ్గర సంచరిస్తున్నాయి. **- గ్రామస్థులు**

సమాధానం : కంపచెట్లు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- సర్పని, పంచాయతీ కార్యదర్శి**

సమస్య : ముదిగుబ్బలో తాగునీటి సమస్య నెలకొంది. పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా కాకపోవడంతో చివరి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. **- గ్రామస్థులు**

సమాధానం : మోటార్లు మరమ్మతులు చేయించి నీరు సరఫరా చేస్తున్నాం. **- ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ**

సమస్య : ముదిగుబ్బలో రాత్రి, పగలు తేడా లేకుండా విద్యుత్తు అంతరాయం చోటుచేసుకోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- సుధాకర్, ముదిగుబ్బ**

సమాధానం : విద్యుత్తు సరఫరాకు చర్యలు తీసుకుంటాం. **- శివ తేజ, ఇన్‌ఛార్జి ఏఈ, ముదిగుబ్బ** – న్యూస్‌టుడే, ముదిగుబ్బ

చెత్త తొలగింపు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని ఎస్టీ బాలికల వసతి గృహం సమీపంలో రోడ్డు పక్కన వేసిన చెత్త రెండురోజులుగా తొలగించలేదు. అదికుళ్లి వాసన వస్తుండటంపై 'మేమున్నాం.. మీకుతోడుగా' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైంది. దీనికి కదిరి మున్సిపల్ అధికారులు స్పందించి చెత్త తొలగింపచేశారు.

భూములు స్వాధీనం చేసుకోవాలి

అమడగూరు : అమడగూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట శుక్రవారం రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఆందోళన చేశారు. ఆ పార్టీ నాయకులు మూర్తి, రామచంద్ర, రవి తదితరులు మాట్లాడుతూ కంచనగారిపల్లి సమీపంలో దాదాపు 15 ఎకరాల ప్రభుత్వం భూములను గతంలో పశువుల మేత కోసం కేటాయించారన్నారు. ప్రస్తుతం ఆ భూములను కొందరు ఆక్రమించుకుని అనుభవిస్తున్నారని ఆరోపించారు. ఆ భూములు స్వాధీనం చేసుకోవాలని డిమాండు చేశారు. అనంతరం తహసీల్దారు రామనాథరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

22న ఉద్యోగ మేళా

బుక్కపట్నం, న్యూస్‌టుడే : బుక్కపట్నంలోని శ్రీ సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 22న తేదీన ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ మగ్బూల్ హుస్సేన్, జిల్లా నైపుణ్య అధికారి హరికృష్ణ తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఈ-డిజిటల్ పాలనకు శ్రీకారం

ధర్మవరంపట్టణం : ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్యాలయంలోని అన్ని శాఖల్లోనూ రికార్డులను ఈ-ఆఫీస్ ద్వారా డిజిటల్ పరిపాలన నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ సిబ్బందికి ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని అన్ని విభాగాల ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమర్థవంతమైన పాలన అందించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

చెన్నేకొత్తపల్లి : హర్యాన్‌చెరువు విద్యుత్తు ఉప కేంద్ర పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రామాంజనేయులు తెలిపారు. ఉప కేంద్రంలో నిర్వహణ పనులు చేస్తున్నామన్నారు.

తప్పిన పెను ప్రమాదం..

కొత్తచెరువు, న్యూస్‌టుడే : కొత్తచెరువులో శిథిలావస్థలో ఉన్న పురాతన తహసీల్దారు భవనం గోడ రాత్రి సమయంలో కూలి పెను ప్రమాదం తప్పడంతో అంగన్‌వాడీ సిబ్బంది ఉలికిపాటుకు గురయ్యారు. గ్రామ నడిబొడ్డున రెవెన్యూ శాఖకు చెందిన రెండు భవనాల్లో ముందున్న భవనం పురాతనమైనది కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. పాత భవనంపై రావి వృక్షం ఏపుగా పెరగడంతో గోడలు బీటలువారాయి. అయితే వెనుకవైపు ఉన్న భవనం నివాసయోగ్యంగా ఉండడంతో గత కొంతకాలంగా నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. అద్దె గదుల లభ్యత లేక ఒకే భవనంలో నాలుగు కేంద్రాలను కొనసాగిస్తున్నారు. అంగన్‌వాడీ పిల్లలు పగటిపూట రెండు భవనాల మధ్యలో ఆదమరిచి ఆడుకునే సమయంలో గోడకూలి ఉంటే ప్రాణ నష్టం జరిగేదన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఉదయాన్నే కేంద్రాలను తెరవడానికి వెళ్లిన అంగన్‌వాడీ కార్యకర్తలు గోడ కూలిన దృశ్యాన్ని చూసి బతుకుజీవుడా అంటూ కేంద్రాలను వేరే ప్రదేశాలకు మార్చే పనిలో నిమగ్నమయ్యారు. రెవెన్యూ అధికారులు శిథిలావస్థలో ఉన్న పురాతన భవనాలను తొలగించి పొంచి ఉన్న ప్రమాదాన్ని నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

చేతికందిన పంట వర్షార్పణం

● అన్నదాతలకు తీరని నష్టం

అమడగూరు, న్యూస్‌టుడే : ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందిన సమయంలో వర్షార్పణం అయినట్లు కొలిమిరాళ్లపల్లి, కస్సముద్రం రైతులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, వెంకటస్వామి తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్‌లో వేరుసెనగ పంట ఆశించిన మేరకు దిగుబడి వస్తుందని రైతులు ఆశించారు. ప్రస్తుతం ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా తొలగించిన పంట, పశువుల మేత కుళ్లి పోతోంది. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో కాయలు రంగు మారడంతోపాటు మొలకలు వస్తున్నాయి. దీంతో చేసేదిలేక వేరుసెనగ కాయలను నష్టానికే విక్రయిస్తున్నట్లు రైతులు వాపోయారు.



మొలకెత్తుతున్న కాయలు



రంగుమారిన వేరుసెనగ కట్టె, కాయలు

నేల వాలిన వరిపంట



తనకల్లు: మండలపరిధిలోని కనసానివారిపల్లికి చెందిన రైతు ఉదయ్‌శేఖర్‌కు చెందిన వరి పంట నేలవాలింది. వాయుగుండం కారణంగా ఏకధాటిగా కురుస్తున్న వర్షం కారణంగా అర ఎకరంలో వరి పంట దెబ్బతింది. దాదాపు రూ. 30 వేలు నష్టం వాటిల్లిందని రైతు వాపోయారు.

చెదిరిన పేదల గూళ్లు



నేలకొరిగిన నరసమ్మ నివాసం

కదిరి పట్టణం, న్యూస్‌టుడే : కదిరి పట్టణంలోని వాటర్ ట్యాంక్ రోడ్డులో నివాసం ఉంటున్న నరసమ్మ ఇల్లు పూర్తిగా నేలకొరిగింది. ఇదే ప్రాంతంలో హరీశ్‌బాబుకు చెందిన ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. సున్నపుగుట్టతండాలో 03, కదిరికుంట్లపల్లి, ఏటిగడ్డతండా గ్రామాల్లో రెండేసి నివాసాలు, ఎగువపల్లి, కాళసముద్రం గ్రామాల్లో ఒక్కో ఇల్లు దెబ్బతిన్నాయి. వాటిని కదిరి తహసీల్దార్ మురళీకృష్ణ, పరిశీలించి, బాధితులతో మాట్లాడారు.

కొత్తచెరువు, : మండలంలో వర్షానికి ఇళ్లు కూలిపోయినట్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందాయి. కనిశెట్టిపల్లిలో చంద్రమోహన్, తిప్పాబట్లపల్లిలో నారమ్మ, జనార్దన్, రామచంద్ర ఇళ్లు కూలిపోయాయి. అయితే అదృష్టవశాత్తూ ఇల్లు కూలిన సమయాల్లో ఎవరూ లేక పోవడంతో ప్రాణాపాయం తప్పింది. బాధితుల ఫిర్యాదు మేరకు దెబ్బతిన్న ఇళ్ల పరిశీలనకు ఆర్ఐ కిరణ్ కుమార్‌ను పంపామని డిటి బాలాంజనేయలు తెలిపారు. ఆర్ఐ నివేదిక మేరకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కనిశెట్టిపల్లిలో..

రహదారులు జలమయం



పీఆర్‌టీ కాలనీలో వర్షం నీరు

ధర్మవరం : ధర్మవరంలో శుక్రవారం రాత్రి కుండపోత వర్షం పడింది. గంటపాటు కురిసిన వర్షానికి పట్టణంలోని ప్రధాన రహదారులు, వీధులు జలమయమయ్యాయి. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం ప్రాంతం నుంచి పీఆర్‌టీ కాలనీలోకి భారీగా నీరు చేరింది. ఎన్టీఆర్ కూడలి వద్ద దుకాణాల్లోకి వర్షం నీరు నిలిచింది. పీఆర్‌టీ కూడలి నుంచి గాంధీనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా వర్షం నీరు చేరడంతో ఈ మార్గంలో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పట్టణ శివారు కాలనీల్లోనూ వర్షం నీరు పారడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



ధర్మవరంలో గాంధీనగర్ వెళ్లే ప్రధాన రహదారిపై..

నిర్దిష్ట అభ్యాస వైకల్యంపై అవగాహన ర్యాలీ

తలుపుల, న్యూస్‌టుడే : తలుపులలో శుక్రవారం నిర్దిష్ట అభ్యాస వైకల్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ-1, 2 వెంకటరాముడు, విజయకుమార్ మాట్లాడారు. వైకల్యం ఉన్న పిల్లలను చిన్న వయస్సులోనే గుర్తించి తగిన శిక్షణ ఇస్తే, భవిష్యత్తులో వారి కాళ్లపై వారు జీవించడానికి అవకాశం కల్పించినట్లు అవుతుందన్నారు. తలుపులలోని భవిత కేంద్రంలో పిల్లలను చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శంకరన్న, భవిత కేంద్రం సీఆర్పీలు భారతి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న అధికారులు, చిన్నారులు

క్రైం కార్నర్

అదృశ్యమైన వృద్ధురాలి మృతి

కనగానపల్లి, న్యూస్‌టుడే: అదృశ్యమైన వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలం దాదులూరులో శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... దాదులూరు గ్రామానికి చెందిన ఓబులమ్మ(70) నాలుగు రోజుల క్రితం ఇంటిలో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకపోయింది. రామగిరి మండలం గంతిమర్రి గ్రామ సమీపంలో ఉన్న ఓ పొలం వద్ద ఉన్నట్లు సమీపంలో వారు సమాచారం ఇవ్వడంతో అక్కడి వెళ్లి చూడగా మృతి చెందింది. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు తడిచి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కుటుంబసభ్యులకు బాలిక అప్పగింత

ధర్మవరం, న్యూస్‌టుడే : ధర్మవరంలోని శాంతినగర్‌కు చెందిన బాలిక శుక్రవారం ఉదయం నుంచి కనిపించలేదని కుటుంబ సభ్యులు ధర్మవరం 2వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేశారు. ధర్మవరంలో అదృశ్యమైన బాలిక అనంతపురం రైల్వేస్టేషన్‌లో ఒంటరిగా ఉండడంతో అక్కడి రైల్వే పోలీసులు గమనించి బాలికను ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. బాలిక నుంచి వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులను పిలిపించి వారికి అప్పగించారు. తల్లి మందలించిందని ఇంటి నుంచి బాలిక వెళ్లిందని పోలీసులు తెలిపారు. బాలిక ఇంటికి చేరడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

కాఫీ కావాలంటూ నగదు కాజేశారు

కదిరి పట్టణం: లాడ్జిలో గది అద్దెకు కోసం వచ్చిన వారు కాఫీ కావాలంటూ మేనేజర్ దృష్టి మళ్లించి రూ. 3.50 లక్షలతో ఉడాయించిన ఘటనపై కదిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు పోలీసులకు తెలిపిన మేరకు వివరాలు. కదిరికి చెందిన నారాయణస్వామి పట్టణంలోని ఓ లాడ్జిలో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. బెంగళూరుకు చెందిన సాల్మన్, ఆయన మిత్రుడు లాడ్జిలో పది రోజులకు గదిని అద్దెకు అడిగారు. అద్దె ఎక్కువగా ఉండటంతో అతను మరో లాడ్జికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. దీన్ని గమనించిన లాడ్జి మేనేజర్ నారాయణస్వామి తమ పెంట్‌హౌస్‌పై తక్కువ అద్దెతో ఉండొచ్చని సాల్మన్‌కు సూచించారు. అందుకు అంగీకరించిన అతను కాఫీ తెప్పించాలని మేనేజర్‌కు సూచించారు. ఆయన కాఫీ ఆర్డర్ ఇచ్చేందుకు వెళ్లేలోపు నగదు పెట్టెలోని రూ. 3.30 లక్షలతో పారిపోయారు. గది కోసం వచ్చిన ఇద్దరు డబ్బులు దొంగిలించినట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

గొలుసు దుకాణ నిర్వాహకుల అరెస్ట్

ఓబుళదేవరచెరువు: అనుమతి లేకుండా గొలుసు దుకాణాలు నిర్వహిస్తున్న ఆరుగురిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 240 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి శుక్రవారం తెలిపారు. టి.కుంట్లపల్లి, గాజుకుంటపల్లిలో గొలుసు దుకాణాలు నిర్వహిస్తుండటంతో దాడులు నిర్వహించి ఆరుగురిని అరెస్ట్ చేసి, మద్యం స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు రమణారెడ్డి, కిశోర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చోరీకి విఫల యత్నం

నల్లచెరువు (కదిరి) : మండలంలోని దేవిరెడ్డిపల్లి గంగమ్మ ఆలయంలో శుక్రవారం తెల్లవారుజామున చోరీకి విఫలయత్నం జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆలయంలో గంగమ్మకు పూజల సందర్భంగా బంగారు గొలుసును అలంకరించారు. ఆభరణం తీయకుండా అలాగే పెట్టారు. అయితే తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి ప్రయత్నించారు. ఆలయ తాళం పగులగొడుతుండగా శబ్దం రావటంతో గమనించిన గ్రామస్థులు కేకలు వేయటంతో చోరీకి వచ్చిన వ్యక్తులు పారిపోయారు.



వైద్యసేవలపై చర్చిస్తున్న ఆరోగ్య టాస్క్‌ఫోర్స్ అధికారులు

మెరుగైన వైద్యసేవలు అందించాలి

నల్లచెరువు (కదిరి) : గ్రామీణులకు మెరుగైన సేవలందించేలా దృష్టి సారించాలని టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం తెలిపింది. నల్లచెరువు మండలం ఉబిచెర్లలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని గురువారం జిల్లా వైద్యఆరోగ్య టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం నాగేంద్ర, కళాధర్, నాగరాజు, వీరమ్మ, సబ్బారావులు సందర్శించారు. ఈ సందర్భంగా సబ్‌సెంటర్‌లోని రికార్డులను తనిఖీ చేశారు. మాతాశిశు ఆరోగ్యసేవలు, వ్యాధి నిరోధక టీకా కార్యక్రమం, బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న సేవలు ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యాధికారి కల్పన, సీహెచ్ఓ రామచంద్రరెడ్డి, సుధాకర్, రెడ్డెమ్మ, మౌనిక, వనజ, మున్నా, శ్రీణివాసరెడ్డిలు పాల్గొన్నారు.

ట్యాంకు కూలితే ప్రమాదమే..



ధర్మవరం పీఆర్టీ కాలనీలో ప్రభుత్వ బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహం ఆవరణంలో ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంకు నెర్రెలు బారి ప్రమాదకరంగా వుంది. వసతిగృహంలోకి వెళ్లాలన్నా, బయటకు రావాలన్నా ట్యాంకు పక్కనే విద్యార్థులు రాకపోకలు చేయాల్సి ఉంది. వర్షం నీరు ట్యాంకు గోడల్లో దిగి మరింత ప్రమాదకరంగా మారింది. ట్యాంకు ఎప్పుడు కూలుతుందోనని వసతిగృహం విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. వసతిగృహం వార్డెన్ వెంకటేశ్‌ను వివరణ కోరగా పాతబడిన ట్యాంకును తొలగించాలని పురపాలక అధికారుల దృష్టికి తీసుకెళ్లానని, త్వరితగతిన తొలగిస్తామని చెప్పారన్నారు. **– న్యూస్‌టుడే, ధర్మవరం**

రాకపోకలకు తప్పని తిప్పలు

ముదిగుబ్బలోని దొరిగల్లు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలవడంతో రాకపోకలకు చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు ధ్వంసమై గుంతలు ఏర్పడి ఉన్న రహదారిపై గుంతలు కనిపించకుండా వర్షపు నీరు నిలిచి ఉండటంతో వాటిని వాహన చోదకులు అంచనా వేయలేక ప్రమాదాలకు గురవుతున్నారు. చెలిమిబావి వీధిలో నీటికుంటలా నీరు నిలిచింది. మురుగు కాలువలు నిండి ఇళ్ల ముందు పారడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి.

– న్యూస్‌టుడే, ముదిగుబ్బ





చెరువు మరువకు మరమ్మతులు చేయరా?

ఐదు రోజులుగా కురుస్తున్న వర్షానికి బుక్కపట్నం మండలంలోని చంద్రాయునిపల్లి చెరువు పూర్తిస్థాయిలో నిండింది. మరువ కింద భాగం చాలా వరకు దెబ్బతింది. ఒకవైపున నీరు వృథాగా పోతోంది. దానికి మరమ్మతులు చేయాలని రైతులు పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. చెరువు తూములు, మరువ మరమ్మతులు చేయడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారు. మరువ గండ్లు పడితే నీరు వృథాగా పోవడమే కాకుండా పంటలు పండించుకోలేమని, కనీస మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, బుక్కపట్నం

ఏళ్లుగా సాగుతున్న నిర్మాణం

గత ప్రభుత్వ పాలనలో మండలంలోని మాల్యవంతంలో విలేజ్ క్లినిక్ (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్) భవనం నాలుగేళ్ల కిందట నిర్మాణం ప్రారంభించినా నేటికీ అరకొర పనులతో ఆగిపోయింది. దీంతో పంచాయతీలోని అనంతసాగరం, ఎం.చెర్లోపల్లి, చీమలనాగేపల్లి, వెంకటగారిపల్లి, మాల్యవంతం ప్రజలకు ఆ మందిర్ వైద్య సేవలు అందడం లేదు. గ్రామంలో చిన్నపాటి ఆరోగ్య సమస్యలు తలెత్తితే బత్తలపల్లి, ధర్మవరం ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పనులు పూర్తి వెంటనే ప్రారంభించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయంపై పీఆర్ ఏఈ రమణయ్యను వివరణ కోరగా త్వరలోనే పనులు పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, బత్తలపల్లి



రిజిస్ట్రార్ కార్యాలయ మార్గంలో కంపు



ధర్మవరం పట్టణంలోని మార్కెట్‌లోని కుళ్లిన కాయగూరల వ్యర్థాలను తీసుకొచ్చి రిజిస్ట్రార్ కార్యాలయంలోకి వెళ్లే మెట్ల వద్ద వేస్తున్నారు. దీంతో పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. వ్యర్థాలను తినేందుకు గుంపులు, గుంపులుగా పశువులు వస్తుండటంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కార్యాలయానికి వచ్చే అవసరార్థులు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యర్థాలను వేయకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. సమస్యను మున్సిపల్ శానిటేషన్ అధికారి కేశవ దృష్టికి తీసుకెళ్లగా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద వ్యర్థాలను తొలగిస్తామని, అక్కడ వేయకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

– న్యూస్‌టుడే, ధర్మవరం పట్టణం

(c) eenadu